


మంత్రి లేఖ బట్టబయలు



- మిర్చి యార్డు కార్యదర్శి తీరు వివాదాస్పదం
- రహస్యంగా ఉంచాల్సిన లేఖతో హైకోర్టులో పిటిషన్
- ఆంజనేయులపై ప్రభుత్వ ఉన్నతాధికారులు సీరియస్
- విచారణకు మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత ఆదేశాలు

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓ అంశానికి సంబంధించి మంత్రి.. అధికారులకు రాయగా దానిని రహస్యంగా ఉంచాల్సిన అధికారులే బహిర్గతం చేశారు. ఈ విషయం ప్రస్తుతం గుంటూరు మిర్చియార్డు వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వివాదంలో గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు చిక్కుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో అత్యంత గోప్యత కలిగిన ఫైల్‌లోని లేఖను సంపాదించడం, దాన్ని బహిర్గతం చేయడంపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆయనపై సీరియస్‌గా ఉన్నారు.

ఆ లేఖ ఎలా వచ్చింది...

వ్యవసాయ శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖ బయటకు ఎలా వచ్చిం దన్న దానిపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. పేషీలో ఉన్న ఫైల్ లోని లేఖ బయటకు రావడంపై అధికారులు ఖంగుతున్నారు. ఎవరు ఎవరికి ఈ లేఖను ఇచ్చారన్న దానిపై విచారణ జరిపించి చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు. సదరు లేఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి కార్యాలయం నుంచే బయటకు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి-1964 ప్రకారం ప్రతి ఉద్యోగి అధికారిక విషయాలను బహిర్గతం చేయకూడదు. మంత్రులు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శి అనుమతి లేకుండా వారికి సంబంధించిన విషయాలను, ఉత్త ర్వుల ను, లేఖలను వెల్లడిచేయడం తీవ్రంగా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల్లో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి వ్యవహారంలో ఏ పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.


దీనిపై రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత కూడా మంగళవారం స్పందించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి పంపిన లేఖ ఏ విధంగా బయటకు వచ్చిందనే దానిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కొద్దిరోజులుగా గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారంలో తీవ్ర సందిగ్ధం నెలకొంది. రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరిగా ఉన్న ఆంజనేయులు 2023 డిసెంబరులో అంతకంటే తక్కువ స్థాయి కలిగిన నరసరావుపేట యార్డుకు డిప్యూటేషన్ వేయించుకున్నారు. అక్కడ పనిచేస్తూనే 2024 అక్టోబరు 27న గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు. అయితే పూర్తి స్థాయిలో ఖాళీగా ఉన్న అదే పోస్టు కోసం తాజాగా గ్రూపు-1 అధికారి చంద్రిక ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. చంద్రికను గుంటూరు యార్డు కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రామారావు వ్యవసాయ శాఖ మంత్రికి సిఫార్సు చేశారు. ఆ సిఫార్సులను ఆధారం చేసుకుని విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని 2024 డిసెంబరు 2న వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరికి మంత్రి ప్రత్యేకంగా లేఖ రాశారు. అయితే తాను ఇన్‌చార్జిగా ఉన్న పోస్టులోకి చంద్రిక వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న సంగతి తెలుసుకున్న ఆంజనేయులు పావులు కదపడం ప్రారంభించారు.

హైకోర్టులో రిట్ పిటిషన్..

గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు అనూహ్యంగా ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖను పొందుపరిచారు. మంత్రి, కీలక అధికారి మధ్య గోప్యంగా ఉన్న లేఖను ప్రభుత్వ ఉద్యోగి బయటకు తీసుకురావడం వివాదాస్పదమైంది. మొదట్లో కేసు ఫైల్ చేసిన సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే అందులో రహస్యంగా ఉంచాల్సిన లేఖ జత పర్చినట్లు తేలడంతో సీరియస్ అవుతున్నారు. ఆంజనేయులు కోర్టులో ఫైల్ చేసిన రిట్ ప్రతిని తెప్పించుకుని అందులో పొందుపరిచిన లేఖను పరిశీలిస్తున్నారు.



రోడ్డుపై ధాన్యం రాశులు



నాడు ఆపసోపాలు.. నేడు అభ్యర్థనలు

వైసీపీ హయాంలో ధాన్యం సేకరణ ఒక ప్రహసనంగా జరిగింది. అరకొరగానే లక్ష్యం నిర్దేశించగా దానిని పూర్తి చేసేందుకు రైతులు ఆపసోపాలు పడేవారు. నగదు ఎప్పటికి వస్తుందో తెలియక.. రైతులు బహిరంగ మార్కెట్లో నష్టానికి విక్రయించుకున్నారు. అదే ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించి ధాన్యం సేకరణ లక్ష్యం రోజుల వ్యవధిలోనే ముగిసింది. నగదు వెంటనే జమవుతుండటం.. నిబంధనల సడలింపులతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి అనుమతులపై సానుకూల స్పందన రావాల్సి ఉంది.

- నిర్దేశించిన లక్ష్యం మేర ఇప్పటికే సేకరణ పూర్తి
- అదనంగా సేకరణకు ప్రతిపాదనల ఆమోదంలో జాప్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అవస్థలు
- అయినకాడికి దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నరైతులు
- మిల్లుల్లో నిల్వ చేసుకున్న ధాన్యం విషయంలోనూ తకరారు

అనుమతిస్తే.. అమ్ముకుంటాం

పొలాల్లో ఇంకా లక్షల టన్నుల ధాన్యం

లక్ష్యం మేరకు ధాన్యాన్ని అధికారులు సేకరించారు. ఇప్పటికే ధాన్యం సేకరణ లక్ష్యం ముగిసి ఐదు రోజులు అవు తుంది. అయినా ఇంకా లక్షల టన్నుల ధాన్యం పొలాల్లో ఉంది. ఇప్పటికే కోత లు కోసిన ధాన్యం మరికొంత రైతుల వద్ద ఉంది. ఈ పరిస్థితుల్లో సేకరణకు మరి కొంత అను మతిస్తే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల స్థాయిలో అదనపు అనుమతి కోసం అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతిలపై జాప్యం జరుగుతుండటంతో రైతులు ధాన్యాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు విక్రయించుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధర ను ఇష్టం వచ్చినట్లుగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్ట పోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో నష్టానికి ధాన్యాన్ని విక్రయించి అప్పుల నుంచి బయట పడుతున్నారు. ప్రభుత్వం ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేస్తుండడం.. తేమ శాతంలో కొంత సడలింపు.. తదితరాలతో కొనుగోలు కేంద్రాలకు ఈ సారి భారీగా ధాన్యం రావడం.. అతికొద్ది రోజుల్లో నిర్దేశించిన మేర లక్ష్యం పూర్తి అయింది. ఇంకా దాదాపు నాలుగో వంతు దిగుబడి రావాల్సి ఉంది. ఈ పరిస్థితు ల్లో సత్వరం ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లాలో 50,000 టన్నులు.. గుంటూరు జిల్లాలో 27 వేల టన్నులు.. పల్నాడు జిల్లాలో 5 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఆయా జిల్లాలో ఆ మేరకు ధాన్యం సేకరణ పూర్తి చేశారు. అయినా ఇంకా కల్లాల్లో, పొలాల్లోనే పనల రూపంలో, ఇప్పటికే కోతలు పూర్తి చేసి రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం లక్షల టన్ను ల్లో ఉంది. అయితే నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయిందని ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించడంలేదు. ఈ పరిస్థితుల్లో మద్దతు ధర విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో దళారులకు అయినకాడికి అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో బాపట్ల జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం పూర్తయి ఇప్పటికే 5 రోజులు గడిచింది. మరో 25,000 టన్నుల ధాన్యాన్ని కొనేలా అనుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి రెండు వారాల క్రితమే పంపారు. గుంటూరు జిల్లాలో తొలుత పదివేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించగా తర్వాత రెండు విడతలుగా మరో 17,000 టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మరో 8,000 టన్నులకైనా అనుమతి ఇవ్వాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. పల్నాడు జిల్లాలో అదనంగా మరో 30,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు కోరారు. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ధాన్యం అదనపు సేకరణకు ఆమోదించినా.. ఎంత పరిమాణం, ఎప్పుడన్న దానిపై స్పష్టత కొరవడింది. మరోవైపు ఇదే అదనుగా దళారులు రంగ ప్రవేశం చేసి బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరను మరింతగా పతనం చేసి లబ్ధి పొందే దిశగా సిండికేట్ అవుతున్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన రైతులకు లక్ష్యం పూర్తి కావడంతో అక్కడ నిరాశే ఎదురవుతోంది. పంట రైతుల చేతి కొచ్చేసరికి మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో మరి కొంత ధాన్యం నిల్వ ఉంది.

గడచిన రెండేళ్లను బేరీజు వేసుకుని..

ధాన్యం సేకరణ విషయంలో లక్ష్యాలను నిర్దేశించేటప్పుడు గడచిన రెండేళ్ల ఆధారంగా నిర్దేశించారని సమాచారం. అయితే గడచిన రెండేళ్లలో ఏ ఒక్క ఏడాది కూడా లక్ష్యాలకు మించి ధాన్యం సేకరణ ఏ జిల్లాలోనూ జరగలేదు. నిబంధనల విషయంలో

(మిగతా 8వ పేజీలో..)



బాపట్ల ప్రాంతంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న అన్నదాతలు (పాత చిత్రం)

హిమాలయ అగ్రీటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట

- గుంటూరు రూరల్ మండలంలో విస్తృతంగా తనిఖీలు
- అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనవద్దని రైతులకు సూచన

6



మొబైల్ బానిసత్వం!

8

- ప్రతి ఒక్కరినీ ముంచేస్తున్న స్మార్ట్ ఫోన్లు
- తగ్గించుకోకుంటే ప్రమాదమే అంటున్న నిపుణులు

కుక్కల కుటుంబ నియంత్రణలో..

కాసుల కక్కుర్తి

గుంటూరు కార్పొరేషన్‌లో లక్షలు స్వాహా!



కుక్కకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తున్న దృశ్యం

- అనుభవం లేని పశువైద్యులతో ఆపరేషన్లు
- శునకాల చర్మంపై కత్తి గాటుతో బిల్లులు!
- నగరంలో వందలకొద్దీ కుక్కల మృత్యువాత
- 'స్నే' యానిమల్ వెల్ఫేర్ సొసైటీపై ఆరోపణలు
- గుర్తింపు రద్దు చేసినా కొనసాగింపుపై విమర్శలు

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలోని కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. కుక్కల చర్మంపై గాటు పెట్టి ఆపరేషన్లు చేసినట్లు చూపడం.. అనుభవం లేని పశువైద్యులతో ఆపరేషన్లు చేయించడం.. ఆ తర్వాత తగిన చికిత్స అందించకపోవడంతో వందలాది కుక్కలు మృత్యువాతపడ్డాయి. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు స్వాహా అయినట్లు తెలుస్తోంది. దీనిపై 'స్నే' యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి డబ్బులు చెల్లిస్తున్న కార్పొరేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం, పశుసంవర్ధక శాఖ కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో విమర్శలు వస్తున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో 2024 జూన్ 13న యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం ప్రారంభమైంది. ఇది నిబంధనలకు విరుద్ధంగా నడిచిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కేంద్ర జంతు కల్యాణ మండలికి ఫిర్యాదులు వెళ్లాయి. తనిఖీలు చేపట్టిన కేంద్రం బృందం.. కుక్కలకు ఆపరేషన్లు చేసే కేంద్రాన్ని డంపింగ్ యార్డు వద్ద నిర్వహించడంపై ఆక్షేపించింది. అసలు ఎన్ని కుక్కలకు ఆపరేషన్లు చేశారనే దానిపై రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించింది. ఏబీసీ రూల్ 17 ప్రకారం అవయవాల లెక్క వేయలేదని నిర్ధారించారు. నిబంధనలు పాటించని కారణంగా స్నే సంస్థ గుర్తింపును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ లేఖను జంతు సంక్షేమ బోర్డ్ డిసెంబరు 24న కార్పొరేషన్‌కు పంపింది. అయినా అదే సంస్థతో గుంటూరు నగర పాలక సంస్థ ఇంకా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తూ ఉండ టం మరింత విమర్శలకు తావిస్తోంది.

5 వేల ఆపరేషన్లకు రూ.75 లక్షలు

గుంటూరు, పల్నాడు, బాపట్ల, తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల బాధ్యతను హర్యానాకు చెందిన స్నే యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి అప్పగించారు. ఒక్కో ఆపరేషన్‌కు స్థానిక సంస్థలు రూ.1500 వరకు చెల్లిస్తున్నాయి. నిబంధనల ప్రకారం 2 వేల ఆపరేషన్లు చేసి న సీనియర్ పశువైద్యుడితో ఈ శస్త్రచికిత్స చేయించాలి. అయితే దీనికి విరుద్ధంగా గుంటూరులో గ్రీన్ హెల్త్ అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పశువైద్యురాలితో ఆపరేషన్లు చేయించారనే ఆరోపణలున్నాయి. ఆపరేషన్ తర్వాత మగ కుక్కను 4-5 రోజులు, ఆడ కుక్కను 5-7 రోజులు ఆస్పత్రిలోనే ఉంచాలి. అదేమీలేకుండానే బయటకు వదిలిపెట్టడంతో ఇన్ఫెక్షన్‌తో కుక్కలు మరణించినట్లు జంతు సంరక్షణ కమిటీ సభ్యుడు జాగు సురేష్ ఆరోపిస్తున్నారు.

సొంతంగా చేయించుకున్న వాటికీ బిల్లులు

కొంతమంది జంతు ప్రేమికులు సొంత ఖర్చులతో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. వాటిని కూడా స్నే సంస్థ ఖాతాలో వేశారు. అసలు ఎన్ని కుక్కలకు ఆపరేషన్లు జరిగాయన్న దానిపై సరైన రికార్డులు లేకుండానే నిధుల చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది. కుటుంబ నియంత్రణ చెయ్యాల్సిన కుక్కలు నగరంలో 31 వేల వరకు ఉన్నట్లు అంచనా. వాటిలో 5 వేల కుక్కలకు ఆపరేషన్ చేసినట్లు చెబుతున్నారు. దానికి రూ.75 లక్షలు చెల్లించాల్సి ఉండగా, చాలా వరకు నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. అయితే ఈ చెల్లింపుల సమాచారాన్ని నగర పాలక సంస్థ గోప్యంగా ఉంచుతోంది.




వీడియో కాల్‌లో పెమ్మసానితో ఆనందం పంచుకుంటున్న విద్యార్థి శరత్, పక్కన తల్లి, మంత్రి పంపిన సైకిల్‌తో విద్యార్థి

సమస్య చెప్పిన విద్యార్థికి సైకిల్

- కేంద్ర మంత్రి పెమ్మసాని ట్రస్ట్ సహాయం

తెనాలి రూరల్/ గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దూరాభారంతో పాఠశాలకు వెళ్లేం దుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ సైకిల్ అంజేశారు. ఇటీవల తెనాలి మండలం నంది వెలుగులోని జడ్పీ హైస్కూల్లో నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముగించుకొని తిరిగి పెమ్మసాని వస్తుండగా, అదే స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి మందా శరత్‌బాబు, ఆయన కారు వద్దకు వెళ్లడంతో కారు ఆపారు. నూతనంగా ఏర్పాటు చేసిన స్కూలు దూరంగా ఉందని, స్కూలుకు వచ్చేం దుకు రోజు ఇబ్బంది పడుతున్నానని, స్కూల్ బ్యాగ్ మోయలేక భుజాలు నొప్పి పెడు తున్నాయని మంత్రికి ఆ విద్యార్థి తన సమస్యను వివరించాడు. సావధానంగా విన్న పెమ్మసాని 'నువ్వు బాగా చదువుకుంటానని మాటిస్తే సైకిల్ కొనిస్తాను' అని చెప్పారు. రెండు రోజుల్లో ఆ విద్యార్థి ఇంటికి కొత్త సైకిల్‌ను కొని పంపించారు. శరత్ బాబుకు సైకిల్ అందజేసిన తర్వాత ఢిల్లీలో ఉన్న పెమ్మసాని వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. కేంద్ర మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన విద్యార్థి ఆనంద భాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి కళ్లలో ఆనందాన్ని చూసిన పెమ్మసాని సం తృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పవన్‌కుమార్, లింగారావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై ఎస్పీతో చర్చించాం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది బేతాళ ప్రకాష్‌పై జరి గిన దాడి విషయం పై ఎస్పీ సతీష్ కుమార్‌తో చర్చించినట్లు ఎమ్మెల్యే సంగం డెయి రీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీపై ఎస్పీతో చర్చించినట్లు చెప్పారు. ఇరుపక్షాలపై నమోదైన కేసుల విషయమై డీఎస్పీ స్థాయి అధికారులతో విచారణకు ఆదేశించినట్లు, న్యాయవాది ప్ర కాష్‌పై జరిగిన దాడి కేసులో తుళ్లూరు డీఎస్పీని ప్రత్యేక విచారణ అధికారిగా నియ మించినట్లు ఎస్పీ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన ఎస్‌ఐ రాజకుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారని విచారణ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు నరేం ద్ర కుమార్ తెలిపారు. కాగా, గత కొన్నిరోజులుగా న్యాయవాదులు గుంటూరు ఫెడ రేషన్, పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు.ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు ఈ దాడి గురించి వివరించారు. సమ స్య పరిష్కారం కోసం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేప థ్యంలో ఎస్పీతో ఈ విషయమైన ఎమ్మెల్యే చర్చించారు.

యార్డులో రైతులు భోజనానికి ఇబ్బంది పడొద్దు

- విస్తృత తనిఖీలు నిర్వహించిన జేసీ ఆదేశాలు
- భోజనశాలల పరిశీలన
- రైతులతో మాట్లాడి సమస్యలపై అధ్యయనం

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌చార్జ్ అమిలినేని భార్గవ తేజ ముమ్మరంగా తని ఖీలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఆయన యార్డు ప్రాంగణానికి చేరుకున్న ఆయన, సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు, ఇతర అధికారులతో కలిసి తొలుత భోజనశాలలను పరిశీలించారు. ఈ నెల 23 నుంచి రైతులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కానుండటంతో తొలుత వాటిలో కల్పించిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. భోజనానికి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశిం చారు. అనంతరం తాగునీటి కుళాయిల్లో నీటి నాణ్యతను పరిశీలిం చారు. రైతులతో సంభాషించారు. యార్డులో సమ స్యల గురించి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేశారు.

జీరో వ్యాపారం కాదన్న సెక్రటరీ

ఒక లారీలో మిర్చి టిక్కీల లోడింగ్‌కు సంబంధించిన పేపర్లను ఆయన పరిశీలించారు. వాటిల్లో వేమెన్ పత్రం లేకపోవడంపై జేసీ సీరియస్ అయ్యారు. సంబంధిత పర్యవేక్షణ సిబ్బంది ఎవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని సెక్రెటరీని ఆదేశించారు. ఈ సందర్భంగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

ఎక్స్‌పోర్టర్ నాలుగైదు చోట్ల మిర్చిని కొనుగోలు చేస్తారని, ఒక్కో వేమెన్‌కి 10 నుంచి 15 దుకాణాల పర్య వేక్షణ ఉంటుందని, వేమెన్ ఒక్కో షాపులో కాటాలను పరిశీలించి చిట్టీలు ఇస్తుంటారని చెప్పారు. సరుకు ట్రేడింగ్ అయినట్లు లాట్ ఐడీలు ఉన్నాయని, జీరో వ్యాపారం కాదన్న సెక్రటరీ సమాధానంతో జేసీ సంతృప్తి చెందలేదు.



మిర్చియార్డులో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

పెరిగిన మిర్చి దిగుమతి

మిర్చి సీజన్ సంక్రాంతి పండగ సెలవుల తర్వాత ప్రారంభం కావడంతో దిగుమతి బాగా పెరిగింది. దాదాపుగా ఇప్పటికే రెటింపు సంఖ్యలో మిర్చి టిక్కీలను రైతులను విక్రయానికి తీసుకొస్తున్నారు. సంక్రాంతి పండగ ముందు వరకు రోజుకు 50 వేల టిక్కీల లోపే వచ్చేవి. అలాంటిది ఒక్కసారి 90 వేలకు చేరాయి. ఈ సంఖ్య రాబో యే రోజుల్లో 2 లక్షలు దాటిపోతుందని యార్డు వర్గాలు అంచనా వేస్తు న్నాయి. ప్రస్తుతం యార్డులో మిర్చికి మంచి ధరనే లభిస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం యార్డులో వేరే జిల్లాల నుంచి వచ్చిన రైతులను జేసీ వాకబు చేసిన సమయంలో ఒక రైతుకు తన మిర్చికి క్వింటాల్ రూ. 13,500, మరో రైతు రూ. 15,400 ధర లభిం చిందని తెలిపారు. మిరపకాయలు బాగా ఆరబెట్టి తీసుకొస్తే మంచి ధరనే వస్తుందని ఈ సందర్భంగా అధికారులు జేసీకి నివేదించారు.

హిమాలయ అగ్రీటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట

- గుంటూరు రూరల్ మండలంలో విస్తృతంగా తనిఖీలు
- అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనవద్దని రైతులకు సూచన



యనమదలలోని పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు , ఏఓ సుబ్రహ్మణ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏవిధమైన అనుమతి లేకుండా బయో ఉత్పత్తులు విక్రయిస్తున్న హిమాలయ అగ్రిటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట ప్రారంభించింది. మంగళవారం గుంటూరు రూరల్ మండలంలో ని యనమదల, ఓబుల్ నాయుడు పాలెం, చౌడవరం, పొత్తూరు తది తర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు ,ఏఓ సుబ్ర హ్మణ్యం తనిఖీలు నిర్వహించారు.ఈ నెల 17న 'ఆగని ఆగడాలు' అనే శీర్షికతో 'ఆంధ్ర జ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి ఈ ప్రత్యేక తనిఖీ లు చేప ట్టారు. గ్రామాల్లోని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే బయో ఉత్పత్తులు కొనుగోలు చేయవద్దని సూచించారు. 'హిమాలయ అగ్రిటెక్' పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే అనుమతి లేని బయో ఉత్ప త్తులు కొనుగోలు చేసి మోస పోవద్దని విజ్ఞప్తి చేశారు. జీ-2 అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు బయో ఉత్ప త్తుల పేరుతో రైతులకు నకిలీ మందులు విక్ర యిస్తున్నట్లు వచ్చిన వార్తల నేప థ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. అటువంటి వ్యక్తులు తారసపడితే వెంటనే వ్యవసాయ శాఖ కు సమాచారం అందించాలని సూచిం చారు. ఈ సందర్భంగా యనమదలలోని పురుగుమందుల దుకాణాలను ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు తనిఖీ చేశారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్ వర్సిటీ, బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ అవగాహన ఒప్పందం

గుంటూరు (విద్య)జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నా లజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్‌అండ్‌డీ వైస్ ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్, బిజి నెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్ట్రాటజిక్ సర్వీసెస్ హెడ్ మనోగరన్‌లతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధిం చిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

నేటి నుంచి పరీక్షలు

విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ రావు తెలిపారు. పీజీ లో ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంఈడి కోర్సులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొ న్నారు. ఈ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్ల డించారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

యూనివర్సిటీ బస్సు సమయాల్లో మార్పులు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఉద్యోగులను, అధ్యాపకులను వర్సి టీకి తీసుకువచ్చే బస్సుల సమయంలో మార్పులు చేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. సుబ్బారావు తెలిపారు. బస్సు సమయాలను బుధవారం నుంచి 31వ తేదీ వరకు మార్పులు చేసినట్లు తెలిపారు.

డాక్టర్ వసంతకు జాతీయ ప్రతిభా పురస్కారం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని యూనివర్సిటీ కాలేజీఆఫ్ సైన్స్ కు సంబంధించిన డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఇంజ నీరింగ్ విభాగంలో బోధనా సిబ్బందిగా పని చేస్తున్న డాక్టర్ రుద్రమల్ల వసంత కు సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారం వచ్చింది. ఆమె చేసిన పరిశోధనల కృషికి గాను ఈ అవార్డు లభించింది. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బాని సలై ముఠాగా ఏర్పడి గంజాయిని విక్రయిస్తున్న నిందితులను అరెస్టు చేసి నట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు చెప్పారు. సీఐ స్వాధీ నం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను చూపుతూ స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్ల డించారు. తెనాలికి చెందిన ఏడుగురు యువకులు వేముల సాయిమణికంఠ, ముత్యాల విజయ్, తమ్మిశెట్టి మదన్‌కుమార్, దనావత్ పార్థు, మూర్తి శివకు మార్, కుందాల హనుమంతరావు, ప్రేమ్‌లు చెడువ్యసనాలకు బానిసలై స్నేహితులయ్యారు. వీరు జల్సా చేసేందుకు సులభంగా డబ్బు సంపాదించా లన్న ఆలోచనతో గంజాయి విక్రయాలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అర కులో గుర్తుతెలియని వ్యక్తి నుంచి 1.6 కేజీల గంజాయిని రూ.32 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలికి తీసుకువచ్చి చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా తయా రుచేస్తున్నారు. వాటిని పెడదారిపట్టిన యువతకు, కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో అందరు కలిసి జల్సా చేస్తుంటారు. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక సుల్తానాబాదులోని సెయింట్ ఆన్ స్కూల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వ సనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా ఏడుగురు వ్యక్తుల్లో ఇద్దరు పారిపోగా ఐదుగురిని అదుపులోకి తీసు కున్నారు. వీరి వద్ద నుంచి 1.1 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారుగా రూ. 22 వేలు ఉం టుందన్నారు. పరారీలో ఉన్న కుందాల హనుమంతరావు, ప్రేమ్‌ల కోసం గాలింపుచర్యలు చేపట్టా మని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు వివరించారు.

పల్నాడు జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం

దుర్గి,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాల సంద ర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉత్కంఠగా జరుగు తున్నాయి. మంగళవారం నాలుగుపళ్ల విభాగం పోటీలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 4915 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలి చింది. బాపట్ల జిల్లా ఎద్దుల పూడి మండలం అనంతవరానికి చెందిన పెదవల్లి బ్రదర్స్ ఎడ్ల జత 4750 అడు గులతో రెండో స్థానం, బాపట్ల జిల్లా జెపంగు లూరుకు చెందిన చీకూరి నాగేశ్వరరావు ఎడ్లజత 4678 అడు గులతో మూడో స్థానం, గుంటూరుజిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేశం పద్మానాయుడు ఎడ్లజత 4543 అడు గులతో నాలుగోస్థానం, తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా పెదకొత్తపల్లికి చెందిన శివ ఎడ్లజత 4286 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీ లకు రిఫరీలుగా గూడా శ్రీనివాస రావు, బండ్ల ప్రసాద్‌లు వ్యవ హరించారు. కటకం రామారావు, గంటె గోపాలరావు పర్య వేక్ష ణలో జరిగిన ఈ పోటీల్లో కూనిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యేచూరి సునీత శంకర్, తోటకూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
- దావూస్ పర్యటన విజయవంతంపై హర్షం

వినుకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన, యువ తకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఎన్డీఏ ప్రభుత్వానికే సాధ్యమ ని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే నాలుగు కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఏ రాష్ట్రంలో లేని విధంగా వికిసిత్ ఆంధ్రప్రదేశ్‌కు మార్గం సుగుణమైందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే సెంటుమెంట్‌కు వై సీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని, విశాఖ ఉక్కును తాకట్టుపెట్టా రని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రూ.11,440 కోట్లు కేంద్ర నుంచి తెచ్చి విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊరట కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ దా వూస్ పర్యటన విజయవంతమైందని 11.8 మిలియన్ టన్నుల సామ ర్థ్యంతో ఆంధ్రప్రదేశ్ లక్ష్మి మిటల్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం కుదుర్చుకున్నారన్నారు. రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన మిటల్ కంపెనీకి ధన్యవాదాలు తెలు పుతూ రాష్ట్రానికి పెట్టుబడులకు కృషి చేసిన చంద్రబాబుకు, లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జు నరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, త్వరలో వినుకొండలో ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులతోపాటు కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి మార్గం సుగ మమైం దని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పీవి సురేష్, గోవిందరాజులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

'విశాఖ ఉక్కు అభివృద్ధికి చంద్రబాబే కారకుడు'

పిడుగురాళ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో విశాఖ ఉక్కు ఆర్థిక భరోసా లభిం చిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రకే కాక యావత్ ఆంధ్ర రాష్ట్రా నికి మణిహారంగా విశాఖ ఉక్కు కర్మాగారం వుందని, వేలాది మంది తెలుగువాళ్లు కలిసి వీరోచిత పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్జీవింపజేయడానికి ఎన్డీఈఏ ప్రభుత్వం అన్నివిధాల సహకారం అందించడం సంతోషంగా వుందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ తనపై వున్న కేసుల నుంచి విముక్తి కల్పించుకునేందుకు ఆంధ్ర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికే ఢిల్లీ పర్యటనలు చేశారని విమర్శించారు.

'భాష్యం' ప్రీమియర్ లీగ్ క్రికెట్

గుంటూరు (విద్య)జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): జయాప జయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామ కృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వ ర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్ సమీపం లోని జేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ - బీపీఎల్ 2024-25లో భాగంగా రెండో రోజు మంగళవారం జరిగిన ప్రిలిమినరీ మ్యాచ్‌లు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్‌లో హైదరా బాద్ హాక్స్ జట్టు - 3తో, గుంటూరు జెయింట్స్-3 తలపడగా గుంటూరు జెయింట్స్-3 జట్టు విజ యం సాధించింది. మధ్యాహ్నం కృష్ణా నైట్స్ జట్టుతో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.



విజేతలకు కప్ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

గౌడ్, గౌడ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాల కేటాయింపు

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 26 షాపులు
- జీవో జారీ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గౌడ్, గౌడ సామా జిక వర్గాలకు మద్యం దుకాణాల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 13 విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాస రావు, గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి అరుణకుమారి, పల్నాడు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మణికంఠ తదితరులు ఆయా సామాజిక వర్గాల వారీగా జనాభా ప్రకా రం మద్యం షాపులను కేటాయించనున్నారు. గుంటూరు జిల్లాలో 13 షాపులు, పల్నాడు జిల్లాలో 13 షాపులు చొప్పున మొత్తం 26 షాపులను ఆ రెండు సామాజిక వర్గాలకు కేటాయించారు. గుంటూరు జిల్లాలో గౌడ్ సామాజిక వర్గానికి 4 షాపులు, గౌడ సామాజిక వర్గానికి 9 షాపులు చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు. అదేవిధంగా, పల్నాడు జిల్లాలో కూడా గౌడ్ సామాజిక వర్గానికి 4 షాపులు, గౌడ సామాజిక వర్గానికి 9 షాపులు చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు. త్వరలో టెండర్లు నిర్వహించి, షాపులు కేటాయించనున్నట్లు అధి కారులు తెలిపారు.

84,985 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 87,334 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 84,985 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవ రణలో 56,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14500
నెంబరు. 5	9500	13000
273	11500	11500
341	8000	15000
4884	9500	13500
సూపర్ 10	8000	10500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	15500
బ్యాడిగి	7300	12500
దేవనూరు డీలక్స్	7500	14300
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	13000
నెంబరు.5	7500	7500
273	--	--
341	8500	10500
4884	--	--
సూపర్ 10	8500	12000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	15000
బ్యాడిగి	7500	11500
దేవనూరు డీలక్స్	10000	12500
తెల్లకాయలు	4000	8500

ఐదేళ్ల పశు నష్టపరిహారం చెల్లించిన కూటమి ప్రభుత్వం

● రూ.2.23 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని పశువుల యజమానులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన పశు నష్టపరిహారం చెల్లింపులకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారం రోజులుగా పశు నష్టపరిహారం చెల్లింపులు జిల్లాలో జరుతున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపా రు. 2020 నుంచి 2024 సంవత్సరాల్లో వివిధ రకాల దుర్ఘటనల్లో పాలిచ్చే పశువులు కోల్పోయిన రైతుల ఖాతాలో ప్రభుత్వం నష్టపరిహారం సొమ్మును జమ చేస్తుందని చెప్పారు. పాలిచ్చే గేదెలు, ఆవులు కోల్పోయిన రైతులకు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.30 వేలు ప్రభుత్వం జమ చేసిందన్నారు. జిల్లాలోని రైతులకు నష్టపరిహారం కింద రూ.2.23 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని.. పశువుల యజమానులు ఖాతాలను తనిఖీ చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా బుధవారం బ్రాడీపేట 1/18వ లైను నుంచి 6/22వ లైను వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలానే శ్రీరామ్‌నగర్, హనుమాన్‌నగర్, బాలాజీ నగర్, అమరావతి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు-1 డిపో పరిధిలోని అమరావతి, క్రోసూరు, తుళ్ళూరు, 75 తాళ్ళూరు, పర్చూరు రూట్‌లలో ప్రయాణించే ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్‌యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాల కోసం 9959225420కు సంప్రదించాలని కోరారు.

పేదల పాలిట సంజీవని సీఎంఆర్‌ఎఫ్

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట సంజీవనిలా మారిందని, పేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్షలాది రూపాయలు మంజూరు చేసి తన ఉదారతను చాటుకుంటున్నారని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఏడు గురు అనారోగ్య బాధితులకు ఆమె రూ.22 లక్షల 34వేల చెక్కులను అందజేశారు.

1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్‌లో సవరణలు చేయాలి

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్‌లో సవరణలు చేయాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శికి రాసిన ఒక లేఖలో కోరారు. సర్వీసు పెన్షనర్ మర ణించిన వారి భార్య/భర్తకు పెన్షన్ కొనసాగిస్తున్నారని ప్రభుత్వానికి వివిధ హోదాల్లో దశాబ్దాల కాలం సేవలందించి విశ్రాంత ఉద్యోగులుగా ఉన్న పెన్షనర్లు సర్వీసులో ఉండగా జరిగిన పొరపాట్లకు కోర్టుల్లో శిక్ష పడగానే 1980 పెన్షన్ రూల్స్ ప్రకారం పెన్షన్ నిలుపుదల చేస్తున్నారన్నారు. తద్వారా పెన్షనర్‌పై ఆధారపడిన భార్య ఏ తప్పు చేయకపోయినా పెన్షన్ నిలుపుదల చేస్తే జరుగుబాటు లేక ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనిపై గతంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా మానవీయ కోణంలో ఆలోచించి కొందరికి పెన్షన్ ఇచ్చారన్నారు. పెన్షనర్ మరణిస్తే ఎలా కుటుంబానికి పెన్షన్ ఇస్తున్నారో, పెన్షనర్‌కు శిక్ష పడినా భార్య లేక భర్తకు పెన్షన్ ఆపకుండా ఇవ్వాలని.. దశాబ్దాల కాలం పాటు గృహిణిగా సేవలందించిన వారిని ఇబ్బందుల పాలు చేయకూడదని వీరయ్య విజ్ఞప్తి చేశారు.

లెనిన్ రచనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి : జంగాల

గుంటూరు(తూర్పు), జనవరి 21(ఆంధ్రజ్యోతి): లెనిన్ రచనలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా కొత్తపేట సీపీఐ కార్యాలయంలో లెనిన్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టంగా అమలు చేసి ప్రపంచం లోనే తొలి సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేసిన మహనేత లెనిన్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కోటా మాల్యాద్రి, సురేష్‌బాబు, విజయ్ కుమార్, నూతలపాటి చిన్నా, రావుల అంజి బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులకు ముందే రహదారులు సిద్ధం చేసుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో పాల్గొన్న కమిషనర్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభానికి ముందే నగరంలోని ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మంగళవారం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, జీఎంసీ, రైల్వే, రోడ్లు భవనాల శాఖ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు.

కమిషనర్ మాట్లాడుతూ ఆర్‌వోబీ పనులు ప్రారంభమైతే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రధాన రహదారులను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరానికి కీలకమైన ఆర్‌వోబీ పనులు జరిగే క్రమంలో అన్ని శాఖలను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ బ్రాడీపేట 14వ అడ్డరోడ్డులోని రైల్వే గేటుని ఆర్‌వోబీ నిర్మాణ పనులు జరిగే కాలంలో రాకపోకలకు అవకాశాన్ని కల్పిస్తే ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుందన్నారు. సమావేశంలో రైల్వే ఏవోఎం ముఖేష్ కుమార్, డీఈఎన్ భరత్‌కుమార్, జీఎంసీ ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఆర్‌వోబీ ఈఈ విశ్వనాథరెడ్డి, డీఈఈ చిన్నయ్య, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్యదర్శులు ప్రజారోగ్య కార్మికుల హాజరు తీసుకోవాలి

వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు మస్టర్ సమయంలో తప్పనిసరిగా ప్రజారోగ్య కార్మికుల హాజరు తీసుకోవాలని, మైక్రో పాయింట్స్ వారీగా పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు పారిశుధ్య పనులు జరిగేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశిం చారు. మంగళవారం కమిషనర్ నాజ్ సెంటర్ రిజర్వాయర్‌లోని మస్టర్ పాయింట్లను ఆక స్మిక తనిఖీ చేసి, కార్మికులు, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కావేరినగర్, నగరంపాలెం దర్గా వెనుక రోడ్, ఐపీడీ కాలనీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. నల్లచెరువు మెయిన్ రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ని సందర్శించి ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రతపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో డీఈఈ మధుసూదనరావు, ఆర్‌వో మదన్ గోపాల్, ఏఈలు, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేలన్నింటిని వేగవంతం చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్య సర్వేలన్నింటిని వేగవంతం చేయాలని, నోడల్ అధికారులు, కార్యదర్శులు చేస్తున్న సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అడ్మిన్ కార్యదర్శులు, నోడల్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సచివాలయాల కార్యదర్శులు, నోడల్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ తొలుత కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, పీఏసీఎస్, హౌసింగ్ జియో ట్యాగ్, ఎన్‌పీసీఐ, నాన్ రెసిడెంట్ ఇన్ ఏపీ, ఎంఎస్‌ఎంఈ సర్వేల పురోగతిపై వివరాలడిగి తెలుసుకొని, మాట్లాడుతూ సర్వేల వేగవంతంపై కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించి గురువారం నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్ డి.శ్రీనివారావు, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఆర్‌వో రెహమాన్, నోడల్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందిస్తాం

గుంటూరు(తూర్పు), జనవరి 21(ఆంధ్రజ్యోతి): గుర్తింపు కార్డులు ఉండి, భూయజమానులు రుణాలు తీసుకోని వారికి ఈ రబీలో కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వటాని కి సిద్ధంగా ఉన్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో రైతుసంఘం ఆధ్వర్యంలో వ్యవసా యశాఖ, బ్యాంకు అధికారులు, కౌలు రైతులుతో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు పొందేందుకు భూ యజమానులు కూడా సహకరించాలన్నారు. జిల్లాలో 40వేల మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందితే అందులో 12 వేల మంది భూయజమానులు రుణాలు పొందకుండా ఉన్నారని వివరించారు. ఎటువంటి గ్యారెంటీ లేకుండానే భూమి లేని రైతులకు గ్రూపుల ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఏడీఏ శ్రీనివాస రావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, రైతులు పాల్గొన్నారు.

సిబార్‌లో నేడు దంత వైద్య సేవలు ఉచితం

పెదకాకాని, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తక్కెళ్ళపాడులోని సిబార్ దంత వైద్య కళాశాలలో ఈనెల బుధవారం ఆరోస్త్రోడాన్టిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పేదలకు ఉచితంగా దంత వైద్య సేవలు అందిస్తున్నామని కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అందులో భాగంగా పూర్తిగా, పాక్షికంగా పళ్ళు లేని వారికి పళ్ళ సెట్టు ఉచితంగా అందజేస్తామన్నారు. ఇందుకోసం ఈనెల 22, 23, 24 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు సిబార్‌లోని కట్టుడు పళ్ళ విభాగం లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం డాక్టర్ జి. ఫణికృష (8688893043), డాక్టర్ నాగఫణీంద్ర (6301932833)లను సంప్రదించాలని కోరారు.

23న ఎస్సీల కులగణన తుది సర్వే ఫలితాల ప్రకటన

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా షెడ్యూల్ కులాల కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల(ఆడిట్ ప్రక్రియ) స్వీకారం అనంతరం తుది సర్వే ఫలితాలను ఈ నెల 23వ తేదీన ప్రచురించినున్నట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సర్వే వివరాలను ఈ నెల 20వ తేదీన ప్రచురించనున్నట్లు ప్రకటన జారీ చేశారని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు తేదీని మార్చామన్నారు. అన్ని తనిఖీలు పూర్తి చేసి గురువారం సచివాలయాల్లో సర్వే వివరాల ను ప్రచురిస్తామన్నారు.

ఘనంగా క్రేన్‌గ్రూపు సంస్థల చైర్మన్ జన్మదిన వేడుకలు

● పలు ఆర్యవైశ్య సంఘాల నాయకుల శుభాకాంక్షలు



గ్రంధి కాంతారావుకు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): క్రేన్ గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి వెంకట సత్య లక్ష్మీ కాంతారావు జన్మదిన వేడుకలు మంగళవారం సంపత్‌నగర్‌లోని కార్యాలయంలో, నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పలువురు అభిమానులు, ఆర్య వైశ్య సంఘాల నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సంపత్‌నగర్‌లోని కార్యాలయంలో కాంతారావును కలిసి పుష్పగుచ్ఛంతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే ఆర్యవైశ్య సంఘాల నాయకులు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కొనకళ్ళ సత్యం, రవికుమార్ పలువురు నాయకులు కాంతారావును పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వామి వివేకానంద సందేశం విద్యార్థులకు మార్గదర్శనం

● ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీకు బానిస అవుతుంది' అంటూ స్వామి వివేకానంద ఇచ్చిన అద్భుతమైన సందేశమే విద్యా ర్థులకు నిజమైన మార్గదర్శనమని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. వరగాని గ్రామానికి చెందిన చండీప్రియ, బండారుపల్లి గ్రామానికి చెందిన శశిప్రియ బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వారిద్దరికీ తల్లిదండ్రులు లేని కారణంగా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్, హాస్టల్ ఫీజును చెల్లించేందుకు పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయిని ఉషాకుమారి ద్వారా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం శారదా నికేతన్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థినులకు చెరో రూ.15 వేల చొప్పున రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, మస్తాన్‌వలి, బత్తుల దేవానంద్, పరిశపోగు శ్రీనివాస రావు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, విశ్రాంత ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, షేక్ రబ్బానీ, వెంకటరమణ, గంగాధర్ రెడ్డి, రవీంద్ర, సంజీవరెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, సుశీలరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలతో విద్యను అభ్యసించాలి

● ఎస్పీ సతీష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు (విద్య) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): యువత నైతిక విలువలతో విద్యను అభ్యసించాలని ఎస్పీ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జేకేసీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ యాంటీ డ్రగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరిం చారు డ్రగ్స్ వినియోగం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ విద్యార్థుల ను చదివిస్తున్నారని వారి శ్రమను వృధా చేయరాదని సూచించారు. సమావేశంలో కళా శాల ప్రిన్సిపాల్ పీ గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ అనిత, నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి విద్యావేత్తల ఆలోచనలు కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి విద్యావేత్తల ఆలోచనలు కీలకం అని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ సందర్భంగా ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆల పాటి మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అభివృద్ధికి తాను చేసిన సేవలను వివరించి, నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు.

విశిష్ట మహిళలకు సత్కారాలు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన మహిళామూర్తులకు విశిష్ట సత్కారాల కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ తరఫున పెద్ది సాంబశివరావు సహకారంతో 70 ఏళ్లు నిండిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఐదుగురు మహిళలు సత్కారాలు స్వీకరిం చారు. దేవాలయ పాలకమండలి గౌరవాధ్యక్షురాలు గద్దె రామతులశమ్మ (ఆధ్యాత్మిక), వేమూరి రామలక్ష్మి, మాధవపెద్ది మీనాక్షి (సంగీత), సీహెచ్. సుశీలమ్మ (సాహిత్య) వీఎన్‌డీ శ్యామసుందరీదేవి (విద్యా) రంగాల్లో సత్కారాలు అందజేశారు. అనతరం గద్దె రామతులశమ్మ 'జీవనయానం' ఆవిష్కరించారు. కార్యక్రమానికి కుందుర్తి స్వరాజ్య పద్మ జ, ప్రొఫెసర్ ఎన్ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గుళ్ళపల్లి స్వాతి, కుమారి అర్థలపూడి నేహ, గుళ్ళపల్లి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మౌలిక సమస్యలకు.. సోషలిజంతోనే పరిష్కారం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు

గుంటూరు(తూర్పు), జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం అనివార్యమని, ప్రస్తుత ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు సోషలిజమే పరిష్కారమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని, లెనిన్ శతవర్ధంతి సభ మంగళవారం గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజి అధ్యక్షతన జరిగిన సభలో నర్సింగరావు మాట్లాడుతూ భారత దేశంలోనూ బీజేపీ ఫాసిస్టు విధా నాలను అనుసరిస్తుందన్నారు. కార్మికుల ఉపాధిని విస్మరించి, ఏఐ వంటి నూతన టెక్నాల జీని ప్రోత్సహిస్తే ప్రజల కొనుగోలు శక్తి త గ్గిపోయి సంక్షోభం వస్తుందన్నారు. సభలో సీపీ ఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే నళినీకాంత్, ఎస్ భావన్నారాయణ, ఈమని అప్పా రావు, వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాసరిపాలెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమా దంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దాసరిపాలెం సమీపంలోని విజయసారధి దాబా హోటల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా డివైడర్ వద్ద వేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చొక్కాపై స్వెటర్ ధరించి ఉన్నాడు. అతడి వివరాల కోసం సమీపం లోని మిల్లులు, కర్మాగారాల్లో హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాకబు చేసినా ఫలితం లేదు. మృతుడి జేబులో ఎటువంటి పత్రాలు కానీ, సెల్ఫోన్ కానీ లభించలేదు. వివరాలు తెలిసి వారు నల్లపాడు సీఐ వంశీధర్‌కు 868883137లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

27న బీసీ మంత్రులకు సత్కారం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు



సమావేశంలో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న రజక సామాజిక వర్గీయులందరితో కలిసి ఈనెల 27న గుంటూరులో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించి బీసీ మంత్రులను సత్కరించుకుంటామని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వారు విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ టీడీపీకి తొలి నుంచీ బీసీలు వెన్నెముకగా నిలిచారన్నారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బీసీ మంత్రుల అభినందన సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. సభలో కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు సహ బీసీ మంత్రులు పాల్గొంటారని చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రజకులందరు కలసి బీసీ మంత్రులు, నేతలను గౌరవించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బండపల్లి శ్రీనివాసరావు, గుర్రపుశాల రామకృష్ణ, రాచకొండ నాగేశ్వరరావు, తుమ్మేటి మురళి, రాచకొండ లక్ష్మయ్య, మానురాజు సురేష్, కాకర్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజక వర్గంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో రూ.83 లక్షలు, బొంగరాలబీడులో రూ.49.80 లక్షలు, శ్రీనగర్‌లో రూ.53.13 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి అధికారం చేపట్టాక గుంటూరు సమగ్ర ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నామని, ఇది సత్ఫలితాలనిస్తున్నందుకు సంతోషంగా ఉందని నసీర్ తెలిపారు. జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణంతోపాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు కేటాచంచడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తులసి రామచంద్రప్రభు ముందుకొచ్చి రూ.5 కోట్లు విరాళంగా అందించడం అభినందనీయమ న్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, మహంకాళి నరసింహారావు, సొపా టి రత్నం, వంగర ఏడుకొండలు, కోటా పిచ్చిరెడ్డి, నాయుడు మధు, గంగులూరి నవీన్, కొనకళ్ళ సత్యం, విజయ్, వేల్పూరి కిరణ్, పోతురాజు చంద్ర, ఫిరోజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస సదుపాయాలు కరువు

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు కార్యాలయాల్లో కనీస సదుపాయాలు ఉండటం లేదని పలువురు ఏపీఎన్‌జీవో మహిళా నేతలు స్పష్టం చేశారు. మంగళవారం ఏపీఎన్జీవో హోంలో జిల్లా మహిళా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహిళా విభాగం చైర్‌పర్సన్ రాధారాణి మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్మెంట్‌లో మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఆయా సమస్యలను జిల్లా అధ్యక్షుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. కన్వీనర్ లక్ష్మీ రమ్య మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు కార్యాలయంలో కనీస సదుపాయాలు లేవన్నారు. కొన్ని కార్యాలయాల్లో నేటికీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లు ఏర్పాటు చేయలేదని వాటన్నిటి పరిష్కార దిశగా అడుగులు వేస్తామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సంవత్సర ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ జిల్లా క్యాలెండరును ఆవిష్కరించారు.



శంకర్ విలాస్ ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా కావలసిన రోడ్డు విస్తరణ శనివారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా మంగళవారం బ్రాడీపేట మెయిన్ రోడ్డులోని తాలూకా చెప్పుల షాపుల వద్ద, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవన యజమానులు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)


● మా పాపకు ఫోన్ అలవాటైపోయింది. ఫోన్ తీసుకుంటే ఏడుస్తోంది. గంటల తరబడి ఫోన్లో బొమ్మలు చూస్తూ గడిపేస్తోంది. ప్రవర్తనలో కూడా మార్పు కనిపిస్తోంది. పిలిచినా పలకడం లేదు. పట్టించుకోవడం లేదు. ఆడుకోవడానికి వెళ్లడం లేదు. పెద్దవాళ్లు ఎత్తుకుంటున్నా దగ్గరకి రావడం లేదు. ఫోన్ లేకుండా తిండి తినడం లేదు. ఎప్పుడూ.. ఫోనే.. మాన్పించలేక పోతున్నాం. ఏం చేయాలి? ఒక చిన్న పిల్లల మానసిక వైద్యుడి దగ్గర ఒక తల్లి ఆవేదన! చిన్నప్పుడు ఏడుపు మాన్పించడానికి చేసిన ఆ పనితో పాప పూర్తిగా ఫోనుకు బానిసై పోయింది.

● మా పాప సెల్‌ఫోన్ వాడుతున్నప్పటి నుంచి మా మాట వినడం తగ్గించింది. మొండిగా సమాధానమిస్తోంది. ఎవరితో ఫోన్‌లో మాట్లాడుతున్నావంటే చెప్పదు. గంటల కొద్దీ ఫోన్‌లోనే గడిపేస్తున్నది. మేమెప్పుడైనా ఊరెళ్తే ఇంట్లో ఒక్కతే ఉండాల్సి వస్తుందని మాతోనే వచ్చేది. ఇప్పుడు మేము ఎప్పుడు ఊరెళ్తామా అని ఎదురుచూస్తున్నట్టుగా ఆమె మాటలు ఉంటాయి. మా అమ్మాయికి ఎవరైనా ప్రేమికుడు ఉన్నారా? లేక ఆ వయసులో ఇలాంటి ప్రవర్తన సహజమేనా? రాత్రుల్లో కూడా సెల్‌ఫోన్ వినియోగిస్తుంటుంది. అసలు మా అమ్మాయి మొబైల్ నుంచి దూరం కావాలంటే ఏం చేయాలి?' సైకియాట్రిస్టు వద్ద ఓ తల్లి ఆవేదన - ఇలా చెప్పుకుంటూ పోతే సెల్‌ఫోన్, ప్రత్యేకించి స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల సమస్యలతో మానసిక వైద్యశాలలో నిండిపోతూ ఉన్నాయి. ఇబ్బడి ముబ్బడి మొబైల్ వినియోగం సమాజాన్నే ప్రమాదంలోకి నెడుతోంది.

● మా అబ్బాయికి మొబైల్ అలవాటైపోయింది. అది ఆపుదామంటే వాడు మాపైనే చేతులెత్తుతున్నాడు. ఇంట్లో ఉన్న వస్తువులను విసిరేస్తున్నాడు. రాత్రి 2, 3 అయినా మేల్కొనే మొబైల్‌లో ఏవో వీడియోలు చూస్తుంటాడు. ఓ రోజు వాడి ఫోన్ చెక్ చేస్తే అందులో అసభ్యకరమైన వీడియోలు ఉన్నాయి. వాడిని ఎలా మంచి ప్రవర్తనలోకి తీసుకురావాలి? అంటూ ఒక తండ్రి సైకియాట్రిస్ట్‌ను ఆశ్రయించాడు.

● ఒకప్పుడు యువతపైనే ప్రభావం.. నేడు అన్ని వయసులవారూ...

● తగ్గించుకోకుంటే ప్రమాదమే అంటున్న నిపుణులు



మొబైల్ బానిసత్వం!

● ప్రతి ఒక్కరినీ ముంచేస్తున్న స్మార్ట్ ఫోన్లు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మనిషి గుప్పెట్లో ఇమిడిపోయే చిన్న ఫోన్.. నేడు మనిషిని, ఏకంగా మొత్తం మానవ సమాజాన్నే తన గుప్పెట్లోకి తీసుకుంది. మనిషికి మనిషికి మధ్య సంబంధాలను, అనుబంధాలను తుంచేస్తోంది. చుట్టూ అందరూ ఉన్నా.. తనదైన మైకంతో ఒంటరిని చేసేస్తోంది. ఆధునిక ప్రపంచపు అద్భుత ఆవిష్కరణగా ముందుకు వచ్చిన మొబైల్, ఇప్పుడు మహమ్మారిలా మనిషిని వెంటాడుతోంది. తాను చెప్పినట్లల్లా ఆడేలా బానిసను చేసుకుంటోంది.



● యువతపై 'నీలి' నీడ!

యువత భవిష్యత్తును నీలి నీడ నాశనం చేస్తోంది. స్మార్ట్‌ఫోన్ల నుంచి వచ్చే నీలి కాంతులు ఒకవైపు.. అసభ్యకర వీడియోలు మరోవైపు వారి ఆలోచనలను మానసికంగా, శారీరకంగా భ్రష్టు పట్టిస్తున్నాయి. 17- 24 ఏళ్ల మధ్య ఉన్న వారు 44 శాతం మంది, 25-34 మధ్య ఉన్న వారు 41 శాతం మంది అశ్లీల వీడియోలు చూస్తున్నట్టు ఓ సర్వే రిపోర్టు వెల్లడించింది. పరిస్థితిని అవగతం చేసుకోవడానికి ఈ గణాంకాలు సరిపోతాయి. గతంలో మార్కులు, ర్యాంకులు సాధించలేమని ఒత్తిడికి గురయ్యే యువత ఇప్పుడు క్షణకాలం ఫోన్లు ఆగినా, పెద్దలు ఆపేసినా గందరగోళానికి గురవుతున్నట్లు మానసిక నిపుణులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ వాడొద్దని షరతులు విధిస్తే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనకాడటం లేదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటేనే పిల్లల్లో మార్పు తీసుకురాగలమని సైకాలజిస్టులు సూచించారు. చిన్నారులు, యువకులే కాకుండా పెద్దవారిని సైతం మొబైల్ ఫోన్ వీడడం లేదు. ఆధ్యాత్మిక కార్యక్రమాలో, భక్తి పాటలో ఏవో ఒకటి మొబైల్‌లో చూసుకుంటూ వారూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెబుతున్నారు.

ఫోన్లు పిల్లల ప్రాణాలకు శాపాలు

ఆర్. పవిత్ర కన్సల్టెంట్ సైక్రియాటిస్ట్, పల్నాడు జిల్లా



రెండేళ్లలోపు పిల్లలకు ఫోన్ అనేదే ఇవ్వకూడదు. రెండేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అర్ధగంట కంటే తక్కువ సమయం ఇవ్వాలి. సాధ్యమైనంత వరకూ తల్లిదండ్రులు, నాన్నమ్మ, తాతయ్యలు దగ్గరకు తీసుకోవాలి. వారితో ఎక్కువ సమయం గడపాలి. వారికి కబుర్లు, కథలు చెప్పాలి. దగ్గరుండి వారిని మిగిలిన పిల్లలతో కలిసి ఆడుకునేలా చేయాలి. ఫోన్ వాడే సమయంలో పేరెంటల్ కంట్రోల్ తప్పనిసరిగా ఉండాలి.

తీవ్ర మానసిక సమస్యలు..

వీ వెంకట కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఎక్కువ సేపు ఫోన్ చూడడం ద్వారా మెదడులో డొపమైన్ విపరీతంగా ఉత్పత్తి అవుతుంది. దాన్ని వినియోగించుకోలేక పోతే అది అస్తవ్యస్తంగా మారుతుంది. ఆ కారణంగా మానసిక సమస్యలు వస్తాయి. ప్రధానంగా నిద్రలేమి, ఏకాగ్రత కొరవడడం, క్షణికావేశం, విచక్షణ కోల్పోవడం, ఆత్మహత్య ఆలోచనలు, ఏడీహెచ్‌డీ, ఆటిజం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆ కారణంగా కొద్ది సేపు ఫోనుకు దూరమైనా చచ్చిపోవాలనే స్థితికి వచ్చేస్తారు. ప్రస్తుతం చిన్నారులు మొదలు, పెద్దవారి వరకూ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. మొబైల్ నుంచి క్రమ పద్ధతిలో దూరమవ్వకపోతే అనర్థాలు తప్పవు.



● ఎలా బయటపడాలి?

మొబైల్ మేనియా నుంచి బయటపడాలంటే స్వీయ నియంత్రణ అనేది చాలా ముఖ్యం. ఎవరైనా అశ్లీల వీడియోలకు అడిక్ట్ అయి ఉంటే వారు మొదటగా ఆ విషయాన్ని తమలో తాము ఒప్పుకోవాలి. తమలో వచ్చిన మార్పులను గ్రహించాలి. రోజులో వారు ఎంత సమయం ఎటువంటి యాక్టివిటీస్‌కు వినియోగిస్తున్నామో పేపర్‌పై రాసుకోవాలి. మనం చేయాల్సిన పనిని రద్దు చేసుకుని మరీ సెల్‌ఫోన్‌లోనే గడిపేస్తున్నామా? అనేది ఆలోచించాలి. ఇటువంటి ప్రవర్తనతో వచ్చే ప్రతికూల పరిస్థితులను బేరీజు వేసుకోవాలి. ఈ సమయంలో అడిక్షన్ నుంచి బయటపడడానికి మార్గాలు వెతుక్కోవాలి. చాలా వరకు ఒత్తిడితో ఉండే వాళ్లు, ఖాళీ సమయం ఎక్కువగా ఉన్నవాళ్లు ఆ సమయంలో ఇటువంటి విషయాల బారినపడుతుంటారు. ఎందుకంటే అన్నింటిలో కన్నా సెక్స్ అనేది చాలా సంతోషకరమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో మొబైల్ డేటా తగ్గించుకోవడం, అశ్లీల యాక్టివిటీ సదుపాయాలను రద్దు చేసుకోవడం చేయాలి. ఇది నెమ్మదిగా జరిగే ప్రక్రియ. ఖాళీ సమయాల్లో తమకు నచ్చిన ఇతర అభిరుచులు సంగీతం, డ్యాన్స్, ఇతరాత్ర పనులపై ఆలోచనలు సాగేలా దృష్టి కేంద్రీకరించాలి. ఇంకా కుదరని పక్షంలో సైకాలజిస్టును సంప్రదిస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.



అనుమతిస్తే.. అమ్ముకుంటాం

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వం అన్నదాతలకు చుక్కలు చూపించడం ఒక ఎత్తయితే నగదు జమ విషయంలో నెలల తరబడి ఎదురుచూడలేక దళారులనే ఎక్కువగా ఆశ్రయించారు. దీనికి తోడు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర కూడా కొంతమేర ఆశాజనకంగా ఉండడం ఇవన్నీ కూడా గత రెండేళ్లలో సేకరణ అంతంతమాత్రంగా జరిగింది. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విషయాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుంది. ఈ మేరకు చర్యలు చేపడుతుండడంతో సహజంగానే కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం పరిమాణం పెరిగింది. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం, తేమశాతంతో పాటు ఇతర నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలనే ప్రభుత్వ సూచనలు అమలు జరగడం వంటివన్నీ కూడా ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల బాట పట్టడానికి కారణమైంది.

అంచనా వేయడంలో విఫలం..

ధాన్యం సేకరణ లక్ష్యం విషయంలో ప్రభుత్వం సరైన అంచనా వేయలేకపోయింది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలోనే దాదాపు 5 లక్షల టన్నుల దాకా దిగుబడి ఉంటోంది. ఈ జిల్లాలో అతి స్వల్పంగా లక్ష్యం 50,000 కే పరిమితం చేసింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ నెలకొంది. బాపట్ల జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 50,000 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించగా, దాదాపు రెండు లక్షల టన్నుల వరకు ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు క్షేత్రస్థాయి గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇంకో లక్షన్నర టన్నుల వరకు గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో అన్నదాతలు నిల్వ చేసుకున్నారు. చాలా వరకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పెట్టుబడి కోసం స్థానికంగా ఉండే వ్యాపారులను ఆశ్రయించడంతో, ఇప్పుడు ధాన్యాన్ని కూడా వారికే అమ్మకుని నిలువునా మోసానికి గురవుతున్నారు.

ధర మరింత పతనమయ్యే అవకాశం..

ఇన్ని రోజులూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తూ ఉండడంతో బహిరంగ మార్కెట్‌లో ధర రూ.1550కి అటూఇటూ ఉంటూ వస్తోంది. కానీ ఇప్పుడు లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు నిలిచిపోయాయి. ఇదే అదనుగా ధరను మరింత పతనమైంది. దళారులంతా సిండికేట్ అయి అన్నదాతలను వంచించే కుట్రకు తెరలేపారు. ఇప్పటికే క్వింటా ధాన్యం ధర రూ.1400కు తగ్గించి దళారులు అడుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం వెంటనే అదనంగా ధాన్యం సేకరణకు అనుమతులిస్తే అటు రైతులకు మేలు జరగడంతో పాటు బయట మార్కెట్‌లో ధాన్యం ధర మరింత పతనమవకుండా కాపాడినట్లవుతోంది. ఈ పరిస్థితుల్లో వెంటనే మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరో వైపు గతంలో వర్షాల సమయంలో ఉన్న ధాన్యాన్ని ముందుగా మిల్లులకు తరలించాలని ప్రభుత్వం సూచించింది. చాలా మంది రైతులు తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని మిల్లులకు తరలించి నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం లక్ష్యం పూర్తి కావడంతో ఆ ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు వెనకడుగు వేస్తున్నారు. కొనని కాడికి ఎందుకు నిల్వ చేసుకోనిచ్చారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 10,000 టన్నుల ధాన్యం మిల్లుల్లో ఈ ధాన్యం నిల్వ చేసి ఉన్నారు. ఈ ధాన్యం విషయంలో ప్రస్తుతం తకరారు నడుస్తోంది.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని శ్రీ హజరత్ కాలేమస్తాన్‌షా అవులియా(మస్తానయ్యదర్గా) 133వ ఉరుసు మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత ఐదు



ఫకీర్ల నుంచి ఆశీస్సులు పొందుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

రోజులుగా బాబా వారికి దీపారాధన, చాందిని అలంకరణ, శేషవస్త్రాల పంపిణీ, గంధం సమర్పణ, భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు మహోత్సవాల్లో భాగంగా బాబా సమాధిని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి దర్శించుకుని చద్దరును, గంధాన్ని సమర్పించారు. అనంతరం కన్నావారితోటలోని బాబా వారి ఆశీనులైన కుర్చీని యథా స్థానంలో ఉంచారు. దీంతో ఉరుసు ఉత్సవాలు ముగిశాయని దర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.

కన్నావారితోటలోని యథాస్థానంలోకి బాబా కుర్చీ



మస్తాన్‌బాబా సమాధిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

రక్తహీనతను అధిగమించాలంటే పౌష్టికాహారం

ఆరోగ్యంగా ఉండాలంటే సరైన తిండి, సరిపడా నిద్ర చాలా ముఖ్యం. ఈ రెండు విషయాలను నిర్లక్ష్యం చేస్తే, వాటి ప్రభావం వారి భవిష్యత్తు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కౌమార దశలోని బాలికలు, గర్భిణులు రక్తహీనత సమస్య బారినపడ కుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు పాటించక తప్పదు. పౌష్టికాహారం, నిద్ర చక్కగా ఉండాలని, ఈ రెండింటిపై ఎంత శ్రద్ధ పెడితే అంత ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

- కౌమార దశలోని బాలికల్లో, గర్భిణుల్లో అనారోగ్య సమస్యలు
- ఆకలిని చంపేస్తున్న జంక్‌ఫుడ్
- సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ నిద్రకు దూరం
- తగినంత తిండీనిద్ర తప్పనిసరంటున్న వైద్యులు

సత్తెనపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో బాలికలు, ఇంటర్ విద్యార్థినులు ఆరోగ్య సమస్యలతో ముఖ్యంగా విపరీతమైన కడుపునొప్పి, రుతుచక్రం సరిగా జరగక పోవడం, రక్తహీనత వంటి సమస్యలతో సతమతమవుతుంటారు. చాలామంది గర్భిణులు కూడా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇందుకు ముఖ్యకారణం పౌష్టికాహార లోపం. సమయానికి ఆహారం తీసుకోవాలని, తగినన్ని గంటలు నిద్ర పోని పక్షంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలకు రక్తహీనతతో ఉన్న బాలి కల కేసులు, గర్భిణుల కేసులు వస్తున్నాయి. కేవలం, ఏరియా వైద్యశాలకు కాకుండానే పలు ప్రైవేట్ వైద్యశాలలకు కూడా ఈ తరహా కేసులు వస్తున్నాయి. రక్తహీనతను తట్టుకుని ముందుకు వెళ్లాలంటే పౌష్టికాహారం కీలకం అనే విషయాన్ని విస్మరిస్తున్నారు. పాఠశాల, కళాశాల విద్య కోసం దూర ప్రాంతానికి వెళ్ళే బాలికలు, గ్రామాల్లో పొలం పనులకు వెళ్ళే గర్భిణులు పౌష్టికాహారంవిషయంలో ఏమా త్రం శ్రద్ధపెట్టడం లేదు. చిరు తిండ్లు, జంక్‌ఫుడ్ కేకులు, పానీపూరీ, నూడిల్స్ వంటివి ముఖ్యంగా బాలి కలు తీసుకుంటు న్నారు. ఇవి తిన్నాక ఆకలి చచ్చిపోతుంది. దీంతో, రాత్రి భోజనం మానేస్తున్నారు. ఇదే పొరపాటు కొన్ని నెలల పాటు చేస్తే అలవాటు గా మారి అది అనారోగ్యానికి దారితీస్తుంది. ఆ ప్రభావం కొందరి పై పెళ్ళికి ముందు, ఇంకొందరికి పెళ్ళి అయిన తరువాత కన్పిస్తుంది.

ఆహారంతో పాటు నిద్ర విషయంలోనూ ఇదే తప్పు చేస్తున్నారు. టీవీలు, సెల్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ సమయానికి నిద్ర పోవడం లేదు. చాలా మంది పిల్లలు మామూలు సమయం కన్నా స్క్రీన్ సమయం ఎక్కువ నమోదవ్వడం భవిష్యత్ ప్రమాదాన్ని హెచ్చరిస్తుంది. ప్రతి ఒక్కరు కనీసం ఏడు గంటలు నిద్రపోతేనే ఆరోగ్యమని వైద్యులు చెబుతున్నారు. సెల్ ఫోన్‌లు, టీవీలకు, సోషల్‌మీడియాకు అతుక్కుపోవడం వల్ల అనేక మందికి కళ్ళ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రాథమికదశలో సమస్యను ఎదుర్కొన్న వాళ్లలో కొద్దోగొప్పో జాగ్రత్తపడుతున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

డాక్టర్ బీ అరుణ, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి




కౌమార దశలో ఉన్న ఆడపిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. ముఖ్యంగా వారు తీసుకొనే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానికి పౌష్టికా హారం అందించాలి. శారీరక శ్రమ వారిలో లోపిస్తుంది. ఇంటికి వచ్చిన తరువాత ఇంటి పనులు, వంట పనుల్లో సహ కారం అందించేలా బాలికలను వారి తల్లులు ప్రోత్సహించాలి. అప్పుడే వారు శారీరకశ్రమతో ఆరోగ్యంగా ఉంటారు. చదువే ముఖ్యం కాదు. ఆరోగ్యం అంతకన్నా ముఖ్యం. రక్తహీనత, రుతుక్రమం వంటి సమస్యలతో కొంత మంది విద్యార్థినులు వైద్యశాలకు వస్తున్నారు. వారికి మందుల చీటి రాయడం అంటే కాస్త బాధగానే ఉంటుంది. ఫాస్ట్, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని గర్భిణులు

గర్భిణుల్లో 40 మందికి రక్తహీనత

డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రతి నెలా 120 నుంచి 130 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. వీరిలో 40 మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుండటం గుర్తించాం. అవసరమైన వారికి రక్తం ఎక్కించి కాన్పులు చేస్తున్నాం. యుక్త వయస్సులోని విద్యార్థినిలు కూడా రక్త హీన తతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తున్నారు. వారికి ఐరన్ మాత్రలు అందించడంతో పాటు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియ జేస్తున్నాం.

తుదిపోరుకు ప్రీమియర్ లీగ్ పోటీలు

రేపు ఫైనల్స్... బహుమతుల ప్రదానం

మంగళగిరి సిటీ(నవులూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి మండలం నవులూరు అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం నెల్లూరు-కడప, గుంటూరు-విజయనగరం జట్లు తలపడనున్నాయి. 23న ఉదయం ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేస్తారు. ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లును ఇప్పటికే పూర్తి చేశారు.

ప్రీమియర్ లీగ్‌కు అపూర్వ స్పందన

ఇప్పటివరకు మంగళగిరి నియోజకవర్గానికే పరిమితమైన ఎంపీఎల్ పోటీలు ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జట్లను ఆహ్వానించారు. పోటీలను సైతం అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో నిర్వహించడంతో ప్రేక్షకులు, క్రీడాభిమానుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ నెల 12 నుంచి జరుగుతున్న పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 13 జట్లతోపాటు మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు కూడా పాల్గొంది. రోజుకు రెండు మ్యాచ్‌ల చొప్పున జరిగాయి. అభివృద్ధి, సంక్షేమంతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని భావించిన మంత్రి నారా లోకేశ్ మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట సొంత నిధులతో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా లోకేశ్ కృషి చేస్తున్నారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో క్రీడా మైదానాలను కూడా ఏర్పాటు చేశారు. త్వరలో ప్రభుత్వ సహకారంతో మంగళగిరిలో అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. పోటీల్లో ప్రతి క్రీడాకారుడికి అన్ని సదుపాయాలతోపాటు దుస్తులను మంత్రి లోకేశ్ అందజేస్తున్నారు. దాతల సహకారంతో ప్రైజ్ మనీ, ట్రోఫీలు కూడా ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో మంగళగిరి నుంచి పాల్గొనే క్రీడాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.2 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 144 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 173 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 100 క్యూసెక్కులు, నిజాం పట్నం కాల్వకు 98 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 915 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

217 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 217 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,850, మోడల్ ధర రూ.11,850 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,400, గరిష్ఠధర రూ.11,800 మోడల్‌ధర రూ.11,800 పలికాయి.

ప్రభుత్వ అనుమతులు పాటించాలి

కాకుమాను, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కాకుమానులో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకు మంజూరు అయిన నేపథ్యంలో భూమిని, పరిసర ప్రాంతాలను తెనాలి సబ్ కలెక్టర్ (ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్) మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, నియమ నిబంధనలు పాటించాలని ఆరి ఆదిలక్ష్మి(యజమాని)కి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట స్వామి, మండల సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

పెదనందిపాడు(అబ్బినేనిగుంటపాలెం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బినేనిగుంటపాలెంలో సచివాలయ నిర్మాణం చేపట్టనున్న స్థలాన్ని డిప్యూటీ సీఈవో, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కృష్ణ మంగళవారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో జనాభా ప్రాతిపదికన సచివాలయం నిర్మించాల్సి ఉండగా జీజీపాలెం గ్రామానికి సచివాలయం కేటాయించడంతో గ్రామస్థులు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాత మాకినేని ఝాన్సీలక్ష్మి ఇచ్చిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. దీనిపై నివేదిక తయారు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీదేవి, సర్పంచ్ రావిపాటి కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రకాష్‌నగర్‌లో పారిశుధ్య పరిశీలన

తాడేపల్లి టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్, డోలాస్ నగర్, 8వ సచివాలయం పరిధిలో స్పెషల్ డ్రైవ్ స్థానిక పారిశుధ్య సమస్యల పరిష్కారంలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష సిబ్బంది, స్థానికంగా ఉన్న రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. స్థానికులను అడిగి ఇబ్బందులు తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

హత్యాయత్నం కేసులో
నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ కళ్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో తమ్ముడిని చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన అన్నయ్యను మంగళవారం తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కళ్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన షేక్ ఆరిఫ్ వురఫ్ మహబూబ్‌ను అతని అన్నయ్య షేక్ మీరా ఉరఫ్ అసిఫ్ పాత గొడవలు మనసులో పెట్టుకుని డిసెంబరు 12న కూరగాయలు కోసే చాకుతో పొట్టలో పొడిచాడు. చికిత్స అనంతరం బాధితుడు అన్నయ్య మీరాపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళగిరి నార్త్ డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ కళ్యాణ్‌రాజు నేతృత్వంలో ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి హత్యాయత్నం చేసిన మీరాను మంగళవారం అరెస్టు చేశారు.

శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలి

తాడికొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని ఎస్సీ కాలనీవాసులకు శ్మశానం నిర్మించుకోవటానికి స్థలాన్ని కేటాయించాలని ఎస్సీ కాలనీవాసులు వాపోయారు. మంగళవారం తాడికొండ ఎస్సీ కాలనీలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాలనీ వాసుల సమస్యలను తెలుసుకునేందుకు సర్వేను నిర్వహించారు. సర్వే చేయటానికి వచ్చిన కార్మిక సంఘం సభ్యుల వద్ద ఎస్సీ కాలనీ వాసులు సమస్యలు ఏకరువు పెట్టుకున్నారు. కాలనీల్లో చనిపోయిన వారిని పూడ్చటానికి శ్మశానంలో స్థలం లేక పూడ్చిన చోట మృతదేహాలను పూడ్చాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నో ఏళ్ళు అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. సర్వేలో సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, మండల కార్యదర్శి చింతల బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్వచ్ఛ దివస్

తాడేపల్లి టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో ఉన్న కర్మల భవనం వద్ద ఉన్న శివాలయం ప్రాంగణం పరిసరాల్లో అనేక మంది మద్యం తాగుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. దివంగతులైన కుటుంబీకుల పిండప్రదానాలకు వినియోగించే ఈ ప్రాంతంలో విజయ వాడ పొట్టి శ్రీరాములు కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛ దివస్ పేరుతో ఈ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. పాలకులు చేయలేని పనిని విద్యార్థులు చేశారంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యాన్ని, విద్యార్థులను స్థానికులు అభినందించారు.

ఆక్రమిత స్థలాలల్లోని నివాసాల క్రమబద్ధీకరణ

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



ఎంటీఎంసీ కార్పొరేషన్‌పై కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆక్రమిత ప్రాంతాల్లోని నివాసాలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం క్రమబద్ధీకరణ చేసేందుకు సంబంధిత శాఖల ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజతో కలసి ఎంటీఎంసీ పరిధిలో ఆక్రమిత ప్రాంతాల్లోని నివాసాల రెగ్యులరైజేషన్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, రైల్వే, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు, అభ్యంతరం ఉన్న పోరంబోకు, రహదారులు, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వే, దేవదాయశాఖ, వాటర్ బాడీస్ స్థలాల్లో రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో దాదాపు 16,025 నివాసాలు గుర్తించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో ఆక్రమిత స్థలాలు రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న స్థలాల కేటగిరిని పూర్తి స్థాయిలో పరిశీలించి స్థలాల రెగ్యులరైజేషన్‌కు సడలించాల్సిన నిబంధనలపై నివేదిక అందించాలన్నారు. కేటగిరి 1, 2కి సంబంధించిన స్థలాల్లో నివాసాలను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తనిఖీ చేసి వచ్చే మంగళవారం నాటికి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలన్నారు. రహదారులు, శ్మశానాలు, రైల్వే, దేవదాయ, అటవీ శాఖల స్థలాల్లో ఉన్న నివాసాలను సంబంధిత శాఖలు తనిఖీ నిర్వహించి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులందరూ తదుపరి వారంలో జరిగే సమావేశానికి నిర్దేశించిన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎంటీఎంసీ పరిధిలో యూజీడీ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మంచినీటి పంపింగ్ ప్లాంట్ ఏర్పాటుకు, ఈట్ స్ట్రీట్‌కు, స్మార్ట్ మార్కెట్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన స్థలాలు అందించడానికి సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే, మానవవనరులశాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఎంటీఎంటీసీ పరిధిలో ఆక్రమిత స్థలాల్లో నివాసాలను రెగ్యులరైజేషన్ చేసేందుకు ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారన్నారు. ఎంటీఎంసీ పరిధిలో అభ్యంతరంలేని ప్రభుత్వ పోరంబోకు, అభ్యంతరం ఉన్న పోరంబోకు, రహదారులు, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వే, దేవదాయశాఖ, వాటర్ బాడీస్‌లో ఉన్న స్థలాల్లో నిర్వహించిన సర్వేలో గుర్తించిన నివాసాల లబ్ధిదారుల పూర్తి వివరాలు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వేకు సంబంధించిన స్థలాల్లో ఆక్రమణలపై రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఖాజా వలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జడ్పీ సీఈవో జ్యోతి బసు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, జిల్లా అటవీశాఖ అధికారి హిమ శైలజ, డీపీవో సాయికుమార్, సీనియర్ డీఈఎన్ (కోఆర్డినే షన్) జేవీ అనూషా, ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరత్నం, ఏపీపీఐఐసీ జోనల్ మేనేజరు నరసింహారావు, ఓఎస్డీ వరప్రసాదు, తహసీల్దార్లు, దేవదాయశాఖ ఏసీ, ఎంటీఎంసీ డీసీపీ, ఎస్ఈ తదితరులు పాల్గొన్నారు.

పశు పోషకుల చెంతకే వైద్యులు

● ఏడీఏ డాక్టర్ నాయుడు శైలజ



ఫణిదరంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు

వట్టిచెరుకూరు(వింజనంపాడు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయంలో ప్రోత్సాహంతో పాటు మరింతగా ఆర్థిక పరిపుష్టిని అందించే లక్ష్యంతో పశుపోషణ ఎంతగానో దోహదపడుతుందని పెదనందిపాడు ఏడీఏ డాక్టర్ నాయుడు శైలజ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకులకు చేరువగా గ్రామ స్థాయిలోని నిష్ణాతులైన వైద్య బృందంతో నిర్వహిస్తున్న శిబిరాలను మంగళవారం మండలంలోని వింజనంపాడు యామర్రు గ్రామాల్లో నిర్వహించి పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మండలంలో నిర్వహించే పశు వైద్యశిబిరాలకు స్పెషల్ అధికారిగా నియమితులైన ఏడీఏ డాక్టర్ నాయుడు శైలజ విజనంపాడు గ్రామంలో నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వింజనంపాడులో కాట్రపాడు వైద్యాధికారి డాక్టర్ భవ్యశాంతి, యామర్రులో వట్టిచెరుకూరు వైద్యాధికారి కోటేశ్వరమ్మ, నాబార్డు డీడీఎం శరత్‌బాబు, గుంటూరు డీడీఏ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ జగత్ శ్రీనివాసరావు, ఆలపాటి మురళీకృష్ణ, డాక్టర్ పూర్ణచరణ్ తదితరులు వైద్యసేవలు అందించారు రైతు శక్తి డెయిరీ ఫాం శ్రీసత్యసాయి సేవాసహకారంతో శిబిరాలను నిర్వహించారు.

ఫణిదరంలో..

తాడికొండ(ఫణిదరం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశువులకు మెరుగైన వైద్యం అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను ప్రారంభించిందని ఫణిదరం సర్పంచ్ కర్నాటి బాల కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఫణిదరంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో పశు వైద్యశిబిరాలను నిర్వహించటం వల్ల పాడి రైతులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పొన్నెకల్లు పశు వైద్యాధికారి ఆర్ సౌజన్య మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరం ద్వారా 33 పశువులకు, 22 దూడలకు నట్టల నివారణ చేపట్టినట్లు తెలిపారు. 14 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ దివీ శ్రీనివాసాచార్యులు, వైద్యసిబ్బంది వెంకట్రావు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

397 పశువులకు వైద్య పరీక్షలు

పెదనందిపాడు, జనవరి, 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుసులూరు, అన్నవరు గ్రామాల్లో జాతీయ పశు వ్యాధినివారణలో భాగంగా మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు 397 గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు, లేగదూడలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక విప్లవోద్యమానికి మార్గదర్శి లెనిన్

● సీపీఎం జిల్లా నేత పాశం రామారావు



లెనిన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక విప్లవ ఉద్యమాలకు మార్గదర్శి లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి సీపీఎం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రపంచంలో తొలిసారిగా కార్మిక విప్లవాన్ని లెనిన్ తీసుకువచ్చి కార్మికవర్గ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. సీపీఎం నేత జేవీ రాఘవులు మాట్లాడుతూ లెనిన్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, నేతలు పీ బాలకృష్ణ, ఎస్ఎస్ చెంగయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, జనవరి, 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోషలిస్ట్ విప్లవ నాయకుడు, కమ్యూనిష్టు నాయకుడు లెనిన్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో విప్లవ పథంలో ముందుకు సాగుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, రోటరీక్లబ్ అధ్యక్షుడు, సీపీఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివ, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి (పెదవడ్లపూడి), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు జరుగనున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహాసభల తాలూకా గోడప్రతులను మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం ఆవిష్కరించారు. విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జవ్వాది అమ్మయ్య చౌదరి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, ఏబీవీపీ నేతలు ఎం.శాంతి, స్వరూప్, మునగాల పూర్ణిమ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థి ముఖేష్‌కు రజిత, కాంస్య పతకాలు



సాధించిన పతకాలతో కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో కేఎల్ యూనివర్సిటీకి చెందిన నేల వల్లి ముఖేష్ రజత పతకం సాధించినట్టు వర్సిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కే హరికిషోర్ తెలిపారు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముఖేష్‌కు 582/600 స్కోర్‌తో ఈ పతకం లభించింది. ఈ నెల 8 నుంచి చండీఘర్‌లోని మొహాలి షూటింగ్ రేంజ్‌లో పంజాబీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పది మీటర్ల ఎయిర్ పిస్టల్ మిశ్రమ విభాగంలో ముఖేష్, నాగ సాయి తరుణ్, తనిష్క్, మురళీధర్ నాయుడులతో కూడిన కేఎల్‌యూ జట్టు ఐదో స్థానంలో నిలిచి మరో కాంస్య పతకం గెలుచుకుందన్నారు. ముఖేష్ నేలవల్లి కేఎల్‌యూలో బీటెక్ మూడో సంవత్సరం సీఎస్ ఐటీ చదువుతుండగా తనిష్క్, మురళీధర్ నాయుడు బీబీఏ చదు వుతున్నారని చెప్పారు. విజేతలను వీసీ సారధి వర్మ, ప్రో వీసీలు వెంకటరామ, రాజశేఖర్రావు, ప్రసాద్, రిజిస్ట్రార్ సుబ్బారావు, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.

స్వామి వివేకానంద సూక్తులు యువతకు స్ఫూర్తిదాయకం



స్వామివివేకానందుని విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు

దుగ్గిరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద అతితక్కువ కాలమే జీవించినప్పటికీ కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శోభాదేవి మాట్లాడుతూ సత్యానికి ఎవ్వరైనా తలవంచాల్సిందేనని చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడని అన్నారు. స్వామి వివేకానంద తన సూక్తులతో యువతలో స్ఫూర్తిని నింపారన్నారు. ప్రభుత్వం వివేకానందుని జయంతిని యువజన దినోత్సవంగా జరుపుతోందన్నారు. విద్యార్థినులకు వివేకానందుని జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు. విద్యార్థినులందరికీ మిఠాయిల పంపిణీ చేసి, బహుమతుల పంపిణీలో పాల్గొన్న ఉపాధ్యాయిని పద్మావతిని తోటి ఉపాధ్యాయినులు ఘనంగా సత్కరించారు.

26న జరిగే ర్యాలీని జయప్రదం చేయాలి

● ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

తాడేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొం టున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనవరి 26న జరిగే కార్మిక, కర్షక ట్రాక్టర్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. మంగళవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు సంయుక్త కిసాన్ మోర్చ దేశవ్యాప్త పిలుపులో భాగంగా జనవరి 26న 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కరించాలని ట్రాక్టర్, బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్

తాడేపల్లి(వడ్డేశ్వరం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు తోట శ్రీనివాసరావుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్య మాధవి పర్యవేక్షణలో తోట శ్రీనివాసరావు చిలకమర్తిపై కందుకూరి ప్రభావం అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్టు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ పీ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విభాగం అధ్యాపకులైన ఆచార్య వరప్రసాద్ మూర్తి మాధవి, కృష్ణారావు, పాఠశాల హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు జోజప్ప, బుజ్జిబాబు రమణమ్మ, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, ఆనందరావు తదితరులు శ్రీనివాసరావును అభినందించారు.

పశువుల యజమానులకు శుభవార్త

● ఐదేళ్ల పశు నష్టపరిహారం చెల్లించిన కూటమి ప్రభుత్వం

● రూ.2.23 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని పశువుల యజమానులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన పశు నష్టపరిహారం చెల్లింపులకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారం రోజులుగా పశు నష్టపరిహారం చెల్లింపులు జిల్లాలో జరుతున్నట్లు పశు సంవర్ధకశాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. 2020 నుంచి 2024 సంవత్సరాల్లో వివిధ రకాల దుర్ఘటనల్లో పాలిచ్చే పశువులు కోల్పోయిన రైతుల ఖాతాలో ప్రభుత్వం నష్టపరిహారం సొమ్మును జమ చేస్తుందని చెప్పారు. పాలిచ్చే గేదెలు, ఆవులు కోల్పోయిన రైతులకు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.30 వేలు ప్రభుత్వం జమ చేసిందన్నారు. జిల్లాలోని రైతులకు నష్టపరిహారం కింద రూ.2.23 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని.. పశువుల యజమానులు ఖాతాలను తనిఖీ చేసుకోవాలని సూచించారు.

లైవ్ మ్యూజిక్ షోకు విస్తృత ఏర్పాట్లు



ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళగిరి సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో ఈ నెల 23వ తేదీన ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట లైవ్ మ్యూజిక్ షో నిర్వహించనున్నారు. 23న సాయంత్రం 6 గంటల నుంచి గౌతమబుద్ధ రోడ్డులోని ఎన్నారై జంక్షన్ వద్ద బెల్జియన్ వాఫిల్ స్టోర్ ఎదురుగా మియామీ కేఫ్ పక్కన ఉన్న మైదానంలో ఈ మ్యూజికల్ షో జరుగనుంది. ప్రజలు వేలాదిగా తరలివస్తారని అంచనా వేస్తూ అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ సింగర్లు సాయిశిల్ప, సాకేత్, సమీరా భరద్వాజ్, హనుమాన్‌లు తమ గానామృతంతో ప్రేక్షకులను అలరించనున్నారు. కాగా లైవ్ మ్యూజిక్ షో ప్రాంగణాన్ని ఎస్పీ ఎస్ సతీశ్‌కుమార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై స్థానిక అధికారులతో సమీక్షించారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ ఉన్నారు.

రాజధాని గ్రామాల్లో పైర్లు వేయటం మానేయాలి

● రైతు సమన్వయ కమిటి

తుళ్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) రాజధాని గ్రామాల్లో పైర్లు వేయటం మానేయాలని రాజధాని రైతు సమన్వ కమిటి మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. రాజధాని గ్రామాల్లో అనేక చోట్ల పైర్లు వేశారని వాటిని తొలగించి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో కౌల్లు లేక, అభివృద్ధి లేక పంటలు వేసుకొని జీవనం పొందారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్న తరుణంలో పైర్లు వేయటం తగదని రాజధాని రైతు సమన్వయ కమిటీ సభ్యులు బెల్లంకొండ నరసింహారావు సూచించారు. ఇప్పటికే జోన్‌ల వారీగా అభివృద్ధి చేయటానికి టెండర్లు సీఆర్డీఏ ఇచ్చినట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ముందు రైతులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని అందుకు పదేపదే సీఆర్డీఏ అధికారులకు రైతులు విజ్ఞప్తి చేస్తూ ఉండామని సమన్వయ కమిటీ సభ్యులు బెల్లంకొం డ పిలుపునిచ్చారు.

● శాఖమూరు పరిధిలోని దాదాపు 15 ఎకరాల్లో వేసిన జొన్న పంటను సీఆర్డీఏ అధికారులు జేసీబీతో తొలగించారు. రాజధాని పనులు ప్రారంభమవుతున్న క్రమంలో పంటలు వేయవద్దని సీఆర్డీఏ అధికారులు హెచ్చరిస్తున్నా కొంత మంది పైర్లు వేస్తుండటంతో చర్యలకు ఉపక్రమించారు. తుళ్లూరు పోలీసులు సహకారంతో తొలగింపు చర్యలు మంగళవారం నిర్వహించారు. జొన్న పంట చుట్టూ ఉన్న కంచెను తొలగించి దున్నేసినట్లు అధికారులు తెలిపారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆర్థిక సాయం



దాత కల్లూరి శ్రీనివాసరావును సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచ్ లలితకుమారి

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం, వెంగళాయపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధి కార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు 50 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. బూట్లు, యూనిఫాంలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని గమనించి ఈ ఆర్థిక సాయం అందజేశారు. అంతేగాక పాఠశాలలో నెలకొన్న డ్రైనేజీ, కల్వర్టు సమస్యను అధికారుల దృష్టికి తీసు కెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విరాళాన్ని అందజేసిన కల్లూరి శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలితకుమారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందిస్తాం

● లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి, పాల్గొన్న కౌలు రైతు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 21(ఆంధ్రజ్యోతి): గుర్తింపు కార్డులు ఉండి, భూయజ మానులు రుణాలు తీసుకోని వారికి ఈ రబీలో కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో రైతుసంఘం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులు, కౌలు రైతులతో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు పొందేందుకు భూయజమానులు కూడా సహకరించాలన్నారు. జిల్లాలో 40 వేల మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందితే అందులో 12వేల మంది భూయజమానులు రుణాలు పొందకుండా ఉన్నారని వివరించారు. ఎటువంటి గ్యారెంటీ లేకుండానే భూమి లేని రైతులకు గ్రూపుల ద్వారా రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. దశలవారీగా పెంచుకుంటూ రుణాలను మంజూరు చేస్తామని సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం: ఎంవీఐ రాఘవరావు

తెనాలి క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు దూరం చేసుకోవచ్చునని ఎంవీఐ రాఘవరావు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం మార్కెట్ యార్డులో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతివేగం వల్ల యువత ఎక్కువగా వాహన ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం నిద్రమత్తు, మద్యసేవనం, వాహనాలు సరైన కండీషన్‌లో లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం, కారులో సీటు బెల్టు పెట్టుకోకపోవడం వల్ల కూడా ప్రమాదాల్లో గాయపడుతున్నారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అసంపూర్తిగా అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు

● అన్నిహంగులున్నా నిరుపయోగం ● అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఆవరణ ● అధికారులు దృష్టిపెడితే నిర్మాణాలు పూర్తి



సుల్తానాబాదులో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాంగణంలో పడిఉన్న మద్యం సీసా, ఇసుక, కంకర గుట్టలు

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో వచ్చే పేదలకు పూర్తి ఉచితంగా వైద్యసేవలందించి వారి ఆరోగ్యానికి భరోసా నింపేలా అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టారు. తెనాలి పట్టణంలో పలు ప్రాంతాల్లో ఈ హెల్త్ సెంటర్లు ప్రభుత్వ భవనాలలో సేవలందిస్తున్నా మరి కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భవనాలలో సేవలు అందిస్తున్నాయి. వాటికి కూడా ప్రభుత్వ స్థలాలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. అవి కూడా నిర్మాణ పనులు పూర్తి చేసుకొని చిన్నపాటి పెండింగ్ వర్కులతో నిలిచిపోయాయి. అందులో పట్టణంలోని సీఎం కాలనీలో ఒక బిల్డింగ్ ఉండగా మరొకటి సుల్తానాబాద్‌లోని పినపాడు హెల్త్ సెంటర్. ఈ రెండు హెల్త్ సెంటర్లకు భవన నిర్మాణాలు పూర్తికాగా విద్యుత్ వంటి సౌకర్యాలు సైతం ఏర్పాటు చేశారు. అయితే బిల్డింగ్ చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటు టైల్స్ వేయాల్సి ఉంది. అందుకు అవసరమైన ఇసుక, కాంకర రాళ్లు కూడా ఆ ప్రాంతంలోనే గుట్టలుగా పోసి ఉంచారు. ప్రహరీ కొంత మేర కట్టి వదిలేయడంతో వాటికి పిచ్చిమొక్కలు అల్లుకుని బిల్డింగ్ సైతం కళావిహీనంగా మారుతుంది. సీఎం కాలనీలో బిల్డింగ్‌కు ఉన్న గేటుకు తాళాలు వేసి వదిలేశారు. దీంతో గేటు తుప్పుపట్టి ఉంది. ఈ రెండు ప్రాంతాల్లో రాత్రుళ్లు మందుబాబులకు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. లక్షల విలువతో పేదల ఆరోగ్యానికి భరోగా నిలవాల్సిన బిల్డింగ్‌లు మందుబాబులకు అడ్డాగా మారటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు పూర్తి చేసుకుని చిన్నపాటి పనులతో పెండింగ్‌లో ఉండటం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వాటిపై పెద్దగా దృష్టిపెట్టకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ ప్రాంతంలో ఆరోగ్యకేంద్రం నిర్మాణం పూర్తయితే చిన్న చిన్న అనారోగ్యసమస్యలకు పెద్దాసుపత్రికి వెళ్లే పనిలేకుండా వైద్యం అందుతుందని భావించామన్నారు. నిర్మాణ పనులు నిలిచి, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారి తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు హెల్త్ సెంటర్లకు మిగిలి ఉన్న వర్కులను పూర్తి చేసి వాటిని ప్రారంభించి పేదలకు వైద్యసేవలు చేరువ చేయాలని పలువురు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తికాక సీఎం కాలనీలో గేటుకు తాళం వేసి ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్

24న ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుతో సమావేశం

తెనాలి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుతో ఈ నెల 24న నిర్వహించే సమావేశాన్ని జయప్రదం చేయాలని యూఎఫ్ నాయకులు కోరారు. సమావేశ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఎన్జీవో హోమ్‌లో నిర్వహించే సమావేశంలో యుటీఎఫ్ కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు. హనుమంతరావు, రాజశేఖర్, కళాధర్, గయాసుద్దౌలా, కేదార్‌నాథ్, హుస్సేన్‌వలి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాలలో ప్రాజెక్టు ఫెస్ట్

తెనాలి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని కళాశాలలో మంగళవారం ప్రాజెక్టు ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డిగ్రీ స్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. పీపీటీల ద్వారా ప్రజెంట్ చేసే విధానాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ శివరామకృష్ణ మాట్లాడుతూ, నేటిపోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి విద్యార్థికి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. అధ్యాపకులు సుధ, ఆరీఫా, సాంబశివరావు పాల్గొన్నారు.

లెనిన్ శత వర్ధంతి

తెనాలి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో మంగళవారం లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ నిర్వహించారు. తొలి సోషలిస్టు రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ ప్రజల హృదయాలలో నిలిచిపోయారని ప్రొఫెసర్ జ్యోతి బసు అన్నారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో బెన్‌హర్, అనురాధ, నాగమణి, వెంకటేశ్వరరావు, రఘునాథరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోరంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

పొన్నూరుటౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడ హనుమంతరావు అన్నారు. మంగళవారం పొన్నూరు పట్టణంలో సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ జీవో నెం. 21, 31లను వెంటనే రద్దు చేయాలని, 50 నిండిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.10వేల పెన్షన్ అందజజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీన గుంటూరు సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగా శ్రీనివాసరావు, సుబ్బయ్య, వెంకయ్య, రత్నబాబు, సత్యనారాయణ, గోవిందరాజులు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సాహితీ

పొన్నూరుటౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలిగడ్డ సాహితీ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారి సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చర్చించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు ఎంపీడీవో కొప్పాక లలిత, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

పొన్నూరు టౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరులో కాండం తొలచు పురుగు ఉధృతి అధికంగా ఉందని ఏడీఏ వి.రామకోటేశ్వరి అన్నారు. మండల పరిధిలోని కట్టెంపూడి, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మొక్కజొన్న పైరును పరిశీలించి సస్యరక్షణ చర్యలు సూచించారు. కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణకు కార్బొ ఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున మొవ్వ సుడులలో వెయ్యాలని సూచించారు. పొటాష్ ఎరువు వినియోగం ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో దేగల వెంకటరామయ్య, రైతులు సురేష్ బాబు, గాంధీ, మాజీ సర్పంచ్ ఎక్కటి పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న అధికారులు



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్ కుమార్ తదితరులు

శానిటేషన్ పనులను మెరుగుపర్చండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న శానిటేషన్ పనులను మెరుగుపర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగు నీరు రోడ్లపై పారడాన్ని గమనించి స్థానికులతో మాట్లాడుతూ మురుగు కాలువలో వ్యర్థాలను వేయవద్దని, వాటివల్ల నీటి పారుదలకు అడ్డంకులు ఏర్పడి మురుగు నీరు రోడ్లపైకి చేరుతుందన్నారు. మరికొంతమంది డ్రెయిన్‌లను ఆక్రమించి ర్యాంపులను నిర్మించడాన్ని గమనించి వాటిని తొలగించాలని అధికారాలను ఆదేశించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిని ఇతర అభివృద్ధి చెందిన పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక ప్రణాళికలతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అందుకు పురప్రజలు కూడా సహకరించాలని కోరారు. వార్డు ప్రజలు ఇంటి నుంచి వచ్చే చెత్తను మూడు బుట్టల విధానంలో తడి చెత్త, పొడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరువేరుగా ఇంటి వద్దనే పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ప్రజలందరి సహకారంతోనే సుందర తెనాలి సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వడ్లమూడిలో నిరసన తెలుపుతున్న గౌడ సంఘం నాయకులు

'బలహీనవర్గాల అధికారులపై అసత్య ప్రచారం ఆపాలి'

చేబ్రోలు, జనవరి21 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలకు చెందిన పొన్నూరు పట్టణ సీఐ రవి కిరణ్, సిబ్బందిపై కేసులు బనాయించి వారిని సస్పెండ్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేయటం సహేతుకం కాదని బీసీ సంక్షేమ సంఘం నేతలు, జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు తుళ్లూరు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద గౌడ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలలో జరుగుతున్న గొడవను ఆపటానికి వెళ్లిన పోలీసులను బేతాళ ప్రకాష్ దూషించడమే కాకుండా అమర్యాదగా ప్రవర్తించి పోలీసులు పైనే కేసులు పెట్టారని ఆరోపించారు. వైద్యుడికి పోలీసు అధికారులకు కులం, మతం, ప్రాంతం, వర్గాలను అంటగట్టడం సమంజసం కాదన్నారు. కేవలం బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతోనే సీఐపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. న్యాయవాదులకు ఇలాంటి కక్ష సాధింపు చర్యలు తగవని అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ శంకర్ తదితరులు

ఉపాధి కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం: పీడీ

పొన్నూరు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాలలో ఉపాధి కూలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ వీ శంకర్ అన్నారు. మండల పరిధిలోని మం చాల గ్రామంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పీడీ పరిశీలించారు. జాబ్ కార్డు పొంది న ప్రతి కూలికి వంద రోజులు పని కల్పిస్తామన్నారు. పంటకాల్వలతో పాటు చేలల్లోనూ నీటి కుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు. మినీగోకులాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. అనంతరం వేజెండ్ల నారాకోడూరు గ్రామంలో నిర్మించిన మినీగోకులంలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత ఏపీవో ఆనందమోహన్ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు కార్మికులకు సూచించారు. మంగళవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఇండియా లేబర్ లైన్ సభ్యులు సంయుక్తంగా చేపట్టిన ఇండియా లేబర్ లైన్, చైతన్య ప్రచార రథయాత్ర గోడ ప్రతులను సీఐ రమేష్‌బాబు సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యలను ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్ 1-800-833-9020ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మికులకు ఉపయోగపడేలా ఇటువంటి కార్యక్రమాలను చేపట్టిన నిర్వహిస్తున్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఇండియా లేబర్ లైన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, ఇండియా లేబర్ లైన్ స్టేట్ కోఆర్డినేటర్ మాధవరావు, ఫీల్డ్ ఆఫీసర్‌లు సురేష్, ఈశ్వర్ కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సిబార్‌లో నేడు ఉచిత దంత వైద్యసేవలు

● కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్

పెదకాకాని, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తక్కెళ్ళపాడులోని సిబార్ దంత వైద్య కళాశాలలో ఈనెల బుధవారం ఆరోస్ట్రోడాన్టిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పేదలకు ఉచితంగా దంత వైద్య సేవలు అందిస్తున్నామని కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అందులో భాగంగా పూర్తిగా, పాక్షికంగా పళ్ళు లేని వారికి పళ్ళ సెట్టు ఉచితంగా అందజేస్తామన్నారు. ఇందుకోసం ఈనెల 22, 23, 24 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు సిబార్‌లోని కట్టుడు పళ్ళు విభాగంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం డాక్టర్ జి. ఫణికృష (8688893043), డాక్టర్ నాగఫణీంద్ర (6301932833)లను సంప్రదించాలని కోరారు.



వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎస్టీ కాలనీ రోడ్ల వెంబడి వ్యర్థాల తొలగింపు

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీరావు పేట 32వ వార్డు యడ్ల లింగయ్య కాలనీ ఎస్‌టీ కాలనీలో రోడ్డు వెంబడి వ్యర్థాలు పేర్కొనిపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గత కొన్ని నెలలుగా ఆ కాలనీలో సేకరించిన చెత్తను అక్కడే రోడ్డు పక్కన పడవేయడంతో వ్యర్థాలు గుట్టలుగా పేర్కొనిపోతున్నాయని సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం పారిశుధ్య కార్మికులను ఆ ప్రాంతానికి పంపించి వ్యర్థాలను తొలగించి పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పారు. గత రెండు నెలలుగా స్థానికులు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొనివెళ్లి సమస్యలను పరిష్కరించడంతో ఆ ప్రాంతవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

పశువుల యజమానులకు శుభవార్త

● ఐదేళ్ల పశు నష్టపరిహారం చెల్లించిన కూటమి ప్రభుత్వం

● రూ.2.23 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని పశువుల యజమానులకు కూటమి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. గత ఐదేళ్ళలో నాటి వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన పశు నష్టపరిహారం చెల్లింపులకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారం రోజులుగా పశు నష్టపరిహారం చెల్లింపులు జిల్లాలో జరుతున్నట్లు పశు సంవర్ధకశాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. 2020 నుంచి 2024 సంవత్సరాల్లో వివిధ రకాల దుర్ఘటనల్లో పాలిచ్చే పశువులు కోల్పోయిన రైతుల ఖాతాలో ప్రభుత్వం ఈ నష్టపరిహారం సొమ్మును జమ చేస్తుందని తెలిపారు. పాలిచ్చే గేదెలు, ఆవులు కోల్పోయిన రైతులకు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.30 వేలను ప్రభుత్వం జమ చేయనుందన్నారు. ఇందుకోసం జిల్లాలో పాలిచ్చే పశువులను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద రూ.2.23 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని నరసింహరావు తెలిపారు. ఇప్పటికే పశు యజమానుల ఖాతాలలో నగదు జమ జరగుతోందని, పశువుల యజమానులు ఖాతాలను తనిఖీ చేసుకోవాలని నరసింహారావు సూచించారు.

పశు వైద్యశిబిరాలతో పాడి రైతులకు మేలు

తెనాలి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాడిరైతులకు అండగా నిలుస్తూ గ్రామస్థాయిలోనే పశువైద్యశిబిరాలు నిర్వహిస్తుందని సంగంజాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి తెలిపారు. మంగళవారం సంగం జాగర్లమూడిలో ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పలు గేదెలకు పశు ఆరోగ్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. పశుపోషకులకు పలు సూచనలు చేశారు. వెటర్నరీ డాక్టర్ అనుష, విశ్రాంత వైద్యులు కె. బసవపున్నయ్య, అబ్దుల్ ముజీర్, రవీంద్రబాబు, వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పోతురాజుస్వామి గుడి ఆక్రమణ దారులతో మాట్లాడుతున్న దేవదాయ శాఖ అధికారులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం

● దేవదాయ శాఖ కమిషనర్ మాధవి

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

కొల్లిపర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పోతురాజుస్వామి గుడి భూమి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని గుంటూరు దేవదాయ శాఖ కమిషనర్ జి.మాధవి వెల్లడించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఆక్రమణదారుల చెరలో పోతురాజుస్వామి గుడి... మూడంతస్తుల అనధికారి భవన నిర్మాణం కథనంపై దేవదాయశాఖ అధికారులు మంగళవారం స్పందించారు. పోతురాజుస్వామి గుడి ఆక్రమణలను గుంటూరు దేవదాయ శాఖ కమిషనర్ జి.మాధవి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదాదేవి, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలకనంద, వీఆర్వో భాస్కర్‌లు పరిశీలించారు. ఆక్రమణపై ఆక్రమణదారులను, గ్రామ పెద్దలను విచారించారు. ఆక్రమణలపై నివాసం ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అనేక సంవత్సరాల నుంచి మేము ఇక్కడే ఉంటున్నామని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ కమిషనర్ మాధవి మాట్లాడుతూ పోతురాజుస్వామి గుడి స్థలం గ్రామ కంఠంలో ఉందని, గుడి దేవదాయ శాఖ పరిధిలో లేదన్నారు. దేవాలయ కమిటీ పెద్దలు పోతురాజుస్వామి గుడికి సంబంధించిన ఎకరం 80 సెంట్ల స్థలాన్ని దేవదాయ శాఖకు అప్పగిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే ఆక్రమణదారులకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు.



ఆర్మీ డే వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

సైనికుల సేవలు వెలకట్టలేనివి

● ముందస్తు ఆర్మీడే వేడుకల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): సైనికులు సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని ఇటికంపాడు రోడ్డు సమీపంలోవున్న మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద మంగళవారం ముందస్తు ఆర్మీ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సైనికులు దేశ రక్షణ కోసం ప్రాణాలను ఎదురొడ్డి నిలుస్తారని, కుటుంబాన్ని వదిలి దేశంకోసం తమ జీవితాలను అంకితం చేస్తున్న సైనికులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సైనికులు తమ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎయిర్ వైస్ చీఫ్ మార్షల్ సుభాని, మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎంఈవో

కొల్లిపర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటుచేయడం మంచిదన్నారు. విద్యార్థుల పురోగతిని వారికి తెలియజేయాలన్నారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడి మృతి



ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పొన్నూరు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రామకృష్ణ గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం సీఐటీయూ నాయకులు గుర్రం రామకృష్ణ మృతదేహాన్ని నారాకోడూరులో సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ యూనియన్ బలోపేతానికి చేసిన కృషిని మననం చేసుకున్నారు. రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీ నారాయణ, యూనియన్ జిల్లా కమిటీ కార్యదర్శి టీవీజీ రవి శంకర్, రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్, హనుమంతరావు, ఎంబీబీఎస్ రామకృష్ణ, వి.మధుసూధన్‌రావు, బీవీ రెడ్డి, ఆర్.శ్రీనివాసరావు తదితరులతోపాటు గుంటూరు ఒకటో డిపో మేనేజర్ ఎంవీ రామకృష్ణ, ట్రాఫిక్ విభాగం ఇన్చార్జి నరసింహారావు, సిబ్బంది రామకృష్ణకు నివాళి అర్పించారు.

మృతులకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నివాళి



వీరాస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు బోయిళ్ళ మంజరి భర్త వీరాస్వామి మంగళవారం మృతి చెందారు. వీరాస్వామి మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ విద్యానగర్లోని వీరాస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బోయిళ్ళ మంజరిని పరామర్శించి సంతాపం తెలియజేశారు. పలువురు టీడీపీ నాయకులు విద్యానగర్‌లోని వీరాస్వామి గృహానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. అలాగే మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు గ్రామ నివాసి తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సొపాటి జోగయ్య మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.